
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

శనివారం 19 జూలై 2025


# స్థాయి మరిచారా?

## స్థాయీసంఘ సమావేశానికి వైసీపీ జడ్పీటీసీ సభ్యుల డుమ్మా

## జడ్పీ చైర్‌పర్సన్ సహా 45 మంది వైసీపీ సభ్యులు గైర్హాజరు

జిల్లాలో వైసీపీ ప్రజాప్రతినిధుల పోకడ వివాదాస్పదంగా మారింది. రైతులు, ప్రజల సమస్యలపై గళమెత్తాల్సిన వైసీపీ ప్రజాప్రతినిధులు జడ్పీ సర్వసభ్య సమావేశాలను వాకౌట్ చేయడం, స్థాయీ సంఘాల సమావేశాలకు గైర్హాజరు కావడం ఇటీవల రివాజుగా మారింది. మే 25న జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులు తమకు గౌరవ వేతనం ఇవ్వడం లేదనే కారణంతో సమావేశం నుంచి వాకౌట్ చేసి నిరసన తెలిపారు. శుక్రవారం జరగాల్సిన సమావేశానికీ గైర్హాజరయ్యారు. జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై గుడివాడలో టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారనే కారణం చూపి చైర్‌పర్సన్ సహా సభ్యులు డుమ్మా కొట్టారు. దీంతో ఉమ్మడి జిల్లా నుంచి సమావేశాలకు హాజరయ్యేందుకు వచ్చిన అధికారులు కోరం లేక సమావేశాన్ని వాయిదా వేశారు.

- కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసిన అధికారులు
- ఖాళీగా కూర్చుని వెళ్లిపోయిన ఉమ్మడి జిల్లా యంత్రాంగం
- చైర్‌పర్సన్ హారికపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారనే సాకు
- పరిష్కారానికి నోచుకోని రైతులు, ప్రజల సమస్యలు



సమావేశాలను వాయిదా వేస్తున్నట్టు ప్రకటిస్తున్న జడ్పీ సీఈవో కన్నమనాయుడు



జడ్పీ సమావేశ హాల్లో ఖాళీగా కూర్చున్న అధికారులు

**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం :** మచిలీపట్నంలోని జడ్పీ సమావేశపు హాల్లో జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశాలకు మంత్రులు, శాసనసభ్యులు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, వివిధ కార్పొరేషన్లకు చెందిన చైర్మన్లు హాజరవుతారు. జిల్లాలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారంపై చర్చించి, అవసరమైతే తీర్మానంచేసి ప్రభుత్వానికి పంపుతారు. జిల్లాస్థాయి అధికారులు కూడా ఈ సమావేశానికి హజరవుతారు. కాబట్టి కొన్ని సమస్యలకైనా పరిష్కారం లభిస్తుంది. జడ్పీ సర్వసభ్య సమావేశం మాదిరిగానే జడ్పీ స్థాయీసంఘాల సమావేశాలు కూడా ప్రతి మూడు నెలలకోసారి నిర్వహిస్తారు. ఈ సమావేశాలకు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు హాజరై మండల స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని కోరుతుంటారు. పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత, పాఠశాలల నిర్వహణ, సాగు, తాగునీటి ఎద్దడి, అధికారుల పనితీరు, జడ్పీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులు.. ఇతర అంశాలపై

మిగతా 6లో..

### కోరం లేక వాయిదా

జడ్పీ స్థాయీసంఘాల సమావేశాలు శుక్రవారం జరుగుతాయని వారం క్రితమే జడ్పీ సీఈవో కన్నమనాయుడు ఉమ్మడి జిల్లాలోని జడ్పీటీసీ సభ్యులకు, అధికారులకు సమాచారం పంపారు. జిల్లాలో 47 మంది జడ్పీటీసీ సభ్యులు ఉండగా, వారిలో 45 మంది వైసీపీకి చెందినవారే. మోపిదేవి, పెడన జడ్పీటీసీలు మినహా అన్ని మండలాల్లో వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యులే ఉన్నారు. ఒకటి నుంచి ఏడు జడ్పీ స్థాయీసంఘాల సమావేశాల్లో వీరు సభ్యులుగా ఉంటారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల అధ్యక్షతన ఈ సమావేశాలు జరుగుతాయి. శుక్రవారం వైసీపీకి చెందిన చైర్‌పర్సన్‌తో పాటు మిగిలిన సభ్యులెవరూ హాజరు కాలేదు. జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. అయితే, పాలకవర్గ సభ్యులైన జడ్పీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో కోరం లేనందున ఈ సమావేశాలను నిర్ణీత సమయం వరకు వేచిచూసి వాయిదా వేస్తున్నట్లు సీఈవో ప్రకటించారు. టీడీపీకి చెందిన పెడన మండల జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకటనగేష్ ఒక్కరే హాజరయ్యారు.

---

నాగాయలంకలో జాలర్లకు చిక్కిన భారీ టేకు చేప



## జాలర్లకు చిక్కిన భారీ టేకు చేప

**అవనిగడ్డ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** నాగాయలంక బ్యాక్ వాటర్ పాయల్లో శుక్రవారం జాలర్ల వలలకు రెండు భారీ టేకు చేపలు చిక్కాయి. నాగాయలంక గ్రామానికి చెందిన తిరుమలశెట్టి బాలు జాలర్ల బృందం పడవలో వేటకు వెళ్లగా, లంకేవానిదిబ్బ సమీపంలో ఈ చేపలు చిక్కాయి. ఒక్కొక్కటి 50 కేజీలకుపైగా ఉండగా, వాటిని శుక్రవారం నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌కు తీసుకురాగా, కిలో ఒక్కింటికి రూ.150 చెల్లించి స్థానిక మత్స్య ఉత్పత్తుల ఎగుమతిదారులు కొన్నారు.

# అర్ధరాత్రి తవ్వకాలు

## రొయ్యూరు ఎస్సీ సొసైటీ భూముల్లో వైసీపీ నేత అక్రమ క్వారీ

- వారం నుంచి రాత్రి తవ్వకాలు, పగలు గప్‌చుప్
- భారీ లారీలు తిరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు
- రెవెన్యూ శాఖలోని ఓ అధికారి అండతోనే..





రొయ్యూరు సొసైటీ భూముల్లో నీరు ఉబికివచ్చేలా జరిగిన తవ్వకాలు (ఇన్‌సెట్‌లో) సొసైటీ భూముల్లోని ముళ్లచెట్ల మాటున దాచిన ఎక్స్‌కవేటర్

అక్టోబరు 15 వరకు క్వారీల్లో ఇసుక, బుసక తవ్వకాలు జరపకూడదని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను ఓ వైసీపీ నేత ఉల్లంఘించాడు. రొయ్యూరులోని ఎస్సీ సొసైటీ భూముల్లో ఏకంగా రెండు అక్రమ క్వారీలను తెరిచాడు. వారం నుంచి రెండు ఎక్స్‌కవేటర్ల ద్వారా రాత్రిపూట ఇసుక, బుసక తవ్వకాలు జరుపుతున్నారు. పగలు ఎక్స్‌కవేటర్లను పక్కనే ఉన్న ముళ్లపొదల్లో దాచి, రాత్రిపూట యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నా.. తమకేం తెలియదని అధికారులు తప్పించుకోవడం గమనార్హం.

**తోట్లవల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** రొయ్యూరు ఎస్సీ సొసైటీ భూముల్లో ఇసుక, బుసక మేటలు భారీగా ఉన్నాయి. ఈ గ్రామానికి చెందిన ఓ వీఆర్వోకు కూడా ఈ సొసైటీలో భూమి ఉంది. సదరు వీఆర్వో.. ఓ వైసీపీ నేతతో బుసక తవ్వకాలకు డీల్ కుదుర్చుకున్నాడు. రూ.2.5 లక్షల వరకు అందుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆ వైసీపీ నేతకు కొందరు టీడీపీ నేతలు కూడా అండగా నిలవటంతో గత మే నెలలో భారీ ఏర్పాట్లతో క్వారీ ఏర్పాటు చేశాడు. దీనిని కొందరు టీడీపీ నాయకులు విమర్శించారు. ఈ నేపథ్యంలో మే 30న 'దర్జాగా బుసక దందా' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఆ వైసీపీ నేత బుసక తవ్వకాలు నిలిపివేశాడు. గుట్టుగా వచ్చిన మైనింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండానే వదిలేశారు. ఈ వైసీపీ నేతకు రెవెన్యూ శాఖలో ముఖ్యమైన అధికారి మద్దతు బలంగా ఉన్నట్టు

మిగతా 6లో..

### తప్పించుకునే ధోరణి

రొయ్యూరు, నార్తువల్లూరు క్వారీల్లో గతంలో అనుమతులు పొంది స్టాక్‌యార్డులకు ఇసుక తోలిన కాంట్రాక్టర్లు ఇప్పుడు రాత్రి సమయాల్లో అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. అక్టోబరు 15 వరకు క్వారీల్లో తవ్వకాలు జరపకూడదని గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలివ్వటంతో స్టాక్‌యార్డుల్లో ఇసుకను మాత్రమే వినియోగదారులకు అందించాలి. స్టాక్‌యార్డుల మాటున ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతుండడాన్ని పసిగట్టిన ఈ వైసీపీ నేత కూడా తాను అదే బాటలో నడిచేందుకు సిద్ధమై, అధికారులను మచ్చిక చేసుకుని రొయ్యూరు సొసైటీ భూముల్లో క్వారీలు తెలిచినట్టు సమాచారం. వారు చేస్తున్నదే తాను చేస్తున్నట్టు వైసీపీ నేత వాదించడం గమనార్హం.

---

# నేడు గన్నవరానికి మంత్రి లోకేశ్

## ఏపీఐఐసీ–ఏస్ అర్బన్ హైటెక్ సిటీ సందర్శన

### మేథ టవర్‌కు మళ్లీ ఐటీ కంపెనీల కళ



- ఈ-క్లాట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభానికి రాక
- 300 మందికి ఉపాధి అవకాశాలు

**గన్నవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం గన్నవరంలోని ఏపీఐఐసీ-ఏస్ అర్బన్ హైటెక్ సిటీకి రానున్నారు. మేథ టవర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన ఈ-క్లాట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొంటారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఐటీ పార్క్‌కు లోకేశ్ రావటం ఇదే తొలిసారి. దీంతో గన్నవరం ఐటీ పార్క్‌కు పూర్వ వైభవం రాబోతోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 25 కంపెనీలతో కళకళలాడిన మేథ ఐటీ టవర్ ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వంలో వెలవెలబోయింది. ఎలా వచ్చాయో అలా కంపెనీలు తిరుగు ముఖం పట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలను వైసీపీ ప్రభుత్వం ఉపసంహరించటంతో ఈ దుస్థితి ఏర్పడింది. దీంతో రెండో టవర్ పనులు కూడా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఐటీ కంపెనీలపై మంత్రి లోకేశ్ దృష్టి సారించారు. కొత్తగా ఈ-క్లాట్ కంపెనీ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. దీనిని శనివారం ప్రారంభించనున్నారు. ఈ కంపెనీలో 300 మందికి ఉపాధి లభించనుంది.

గుడివాడ-బంటుమిల్లి రహదారిపై వర్షపునీరు



# జోరువాన

## జిల్లాలో రెండోరోజూ కురిసిన వర్షం

- గుడివాడలో రోడ్లు జలమయం
- వరికి ఊపిరినివ్వడంతో రైతుల్లో ఆనందం
- నేడూ కురిసే అవకాశం : వాతావరణ శాఖ

**మచిలీపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** జిల్లావ్యాప్తంగా శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షం వరిపైరుకు కొంతమేర ఊపిరిపోసింది. 15 రోజులుగా జిల్లాలో ఆశించిన మేర వర్షం కురవకపోవడంతో పాటు కాల్వల ద్వారా సక్రమంగా సాగునీరు అందక వరినాట్లు వేసిన పొలాల్లోని పైరు చనిపోయే పరిస్థితి ఏర్పడింది. శివారు ప్రాంతాల్లోని పొలాలకు సాగునీరు అందక

మిగతా 6లో..

## స్పెషల్ బ్రాంచి సీఐ శ్రీనివాసరావు సస్పెన్షన్

**మచిలీపట్నం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** కృష్ణాజిల్లా స్పెషల్ బ్రాంచి సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీపీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. హోంమంత్రి వంగలపూడి అనిత గురువారం మచిలీపట్నంలో పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభోత్సవానికి వచ్చిన సమయంలో వైసీపీ కార్యకర్తలు, మహిళలు మంత్రి కొల్లు రవీంద్ర ఇంటికి వెళ్లే దారిలోని ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జవ్వారుపేటలో చీపుర్లతో నిరసన తెలిపారు. హోంమంత్రితో పాటు మంత్రి కొల్లు రవీంద్ర ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్పీని నిలదీసిన హోంమంత్రి.. సీఎం చంద్రబాబుకు ఈ విషయాన్ని చెబుతానని అన్నట్లు సమాచారం. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ స్పెషల్ బ్రాంచి సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకుంటూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఐజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఎస్పీ గంగాధరరావు తెలిపారు.

---

మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడుతున్న షైనింగ్ టీచర్ దుర్గాభవాని



# వైవిద్యంగా తీర్చిదిద్దాం..

### ఆంధ్రజ్యోతితో షైనింగ్ టీచర్ యలమంచిలి దుర్గాభవానీ

వృత్తిపట్ల నిబద్ధత, విద్యపై సమర్థత, బోధనలో వినూత్నత.. ఆమెను షైనింగ్ టీచర్‌గా నిలబెట్టాయి. విద్యార్థులను సానపెట్టడమే కాదు.. వారిలోని నూతన ఆవిష్కరణలను వెలికితీయడం, వారి సమస్యలను వారే పరిష్కరించుకోవడం.. వంటి ఎన్నో వై'విద్య'భరిత కార్యక్రమాలకు పెనమలూరు జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసిన యలమంచిలి దుర్గాభవాని శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది పది ఫలితాల్లో 54 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడంతో పాటు ఇదే పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిష్ఠాత్మక ఐఐఐటీల్లో ప్రవేశాలు పొందారు. ఆమె కృషిని గుర్తించిన మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో సత్కరించగా, ఆ ఆనందాన్ని దుర్గాభవాని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

8










సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పట్టుపవిత్రాల సమర్పణ 8



జీజీహెచ్‌లో కిడ్నీ మార్పిడి
- త్వరలో శస్త్రచికిత్సల నిర్వహణకు ఏర్పాట్లు
- అందుబాటులోకి అత్యాధునిక పరికరాలు

6

పరస్పర ఫిర్యాదులు
- వైసీపీ నేతల అరెస్టుకు రంగంసిద్ధం
- బందరులో వేడెక్కుతున్న రాజకీయం



హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

## దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

**ఇంద్రకీలాద్రి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** ఇంద్రకీలాద్రి, దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను శుక్రవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాస్ దంపతులు దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలను అందజేసి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు వారికి దుర్గమ్మ చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీ కేశినేని శివనాథ్‌లకు అమ్మవారి చిత్రపటాలు అందజేస్తున్న ఆలయ అధికారులు

### దుర్గమ్మను దర్శించుకున్న రామ్మోహన్ నాయుడు

కనకదుర్గమ్మను కేంద్ర విమానయాన మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్నితో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, అర్చకస్వాములు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఏఈఓ ఎన్.రమేష్, సూపరింటెండెంట్ ఎస్.జగదీష్ వారికి చిత్రపటం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

### కలెక్టర్ లక్ష్మీశ దంపతులు..



కనకదుర్గమ్మను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ దంపతులు దర్శించుకున్నారు. కలెక్టర్ దంపతులకు ఈవో శీనానాయక్, అర్చకులు ఆలయ మర్యాదలను అందచేసి అమ్మవారి దర్శనం కల్పించారు. లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



హైదరాబాద్‌లోని భాగ్యనగర్ మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన దుర్గగుడి ఈవో శీనానాయక్, అధికారులు

### భాగ్యనగర్ మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

**ఇంద్రకీలాద్రి :** తెలంగాణలో బోనాలు ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ భాగ్యనగర్ మహంకాళి అమ్మవారి ఆలయంతో పాటు పలు ఆలయాలలో అమ్మవార్లకు శుక్రవారం బెజవాడ కనకదుర్గమ్మ దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను ఈవో వీకే శీనానాయక్, ఆలయ ప్రధాన అర్చకుడు ఎల్.దుర్గాప్రసాద్, పలువురు అర్చకులు, అధికారులు సమర్పించారు. ఈ సందర్భంగా అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం పట్టు వస్త్రాలను సమర్పించారు. హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల అధ్యక్షుడు జి.రాఘవేందర్ దుర్గగుడి అధికారులు, అర్చకులకు స్వాగతం పలికారు. ఉప్పులగూడలోని మహంకాళి దేవాలయం, లాల్‌దర్వాజాలోని శ్రీసింహవాహిని మహంకాళి దేవాలయం, గౌలిపురాలోని మహంకాళి దేవాలయం, సుల్తానాసాహిలోని జగదాంబ దేవాలయం, హరిబౌలిలోని బేలముత్యాలమ్మ దేవాలయం, బంగారు మైసమ్మ ఆలయం, అక్కన్న మాదన్న దేవాలయం, మీరాలం మండిలోని మహకాళేశ్వర్ దేవాలయంలో బెజవాడ కనకదుర్గమ్మ దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉభయ రాష్ట్రాల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ పట్టు వస్త్రాలు సమర్పించినట్టు ఈవో తెలిపారు.

## భక్తులకు సౌకర్యాల కల్పనే ధ్యేయం

» ఈవో వీకే శీనానాయక్

**ఇంద్రకీలాద్రి, జూలై 18 (ఆంధ్రజ్యోతి):** ఇంద్రకీలాద్రిపై పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పనకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఈవో వీకే శీనానాయక్ ఆలయ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గత 15 రోజులుగా భక్తుల రద్దీ పెరగడంతో పాటు శుక్ర, శని, ఆదివారాల్లో 65 నుంచి 70 వేల మంది భక్తుల రావడంతో ఇంజనీరింగ్, పరిపాలన, మెయిన్ టెంపుల్, అకౌంట్స్ ఫెస్టివల్ తదితర విభాగాల సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. దుర్గాఘాట్ అభివృద్ధి, ఘాట్‌రోడ్డు మెయింటెనెన్స్, క్యూలైన్లలో నిరంతరం తాగునీటి సరఫరా, తగినన్ని మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఈవో ఆదేశించారు. వృద్ధులు, వికలాంగులు, చంటిబిడ్డల తల్లులకు బ్యాటరీ వెహికల్స్ ఏర్పాటు, భక్తులు వేచి ఉండే ప్రదేశాల అభివృద్ధిపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కొండపై రద్దీ నివారించడానికి దిగువన సమాచార కేంద్రం, ప్రసాదాల కౌంటర్లు, క్లోక్‌రూమ్ తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. అదనపు ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేయాలని, వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఈవో చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ చంద్రశేఖర్, రమేష్‌బాబు, వెంకట రెడ్డి, గంగాధర్, తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. దుర్గగుడిలో భక్తులకు కల్పించే మౌలిక సదుపాయాలపై ఈవో శీనానాయక్ శుక్రవారం అర్చకస్వాములతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. అమ్మవారి దర్శనం, తాగునీరు, వాష్‌రూమ్‌లు, వేచిఉండే ప్రదేశాలు, రవాణా సౌకర్యం, ప్రసాదాలు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ఆరాతీశారు.

## రైతులకు నాణ్యమైన ఎరువులు

» సహకార సంఘాల సిబ్బందికి శిక్షణ : నెట్టెం

**మచిలీపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** రైతులకు నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రతి సంఘంలో అవసరమైన లైసెన్సులు ఇచ్చి, మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరాను వేగవంతం చేసినట్టు కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సకాలంలో ఎరువులు అందించడమే లక్ష్యంగా జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఆధ్వర్యంలో అన్ని సహకార సంఘాల్లో సమగ్ర చర్యలు చేపట్టామన్నారు. ఈ చర్యల్లో భాగంగా గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రంలో సహకార సంఘాల సిబ్బందికి ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించినట్టు తెలిపారు. ప్రతి సంఘంలో ఎరువులు నిల్వ ఉండేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేసామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా సరఫరా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. రైతులకు ఎరువులు సమయానికి అందించడంతో పాటు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా నిఘాపెట్టాలని అధికారులకు సూచించినట్టు రఘురాం పేర్కొన్నారు.

# జీజీహెచ్‌లో కిడ్నీ మార్పిడి!

» త్వరలో శస్త్రచికిత్సల నిర్వహణకు ఏర్పాట్లు

» అందుబాటులోకి అత్యాధునిక పరికరాలు

» పేద రోగులకు మేలు చేకూరే అవకాశం

**విజయవాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు ఆసుపత్రిలో సంబంధిత విభాగ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడే రోగులకు డయాలసిస్‌తో పాటు ఇతర వైద్యసేవలను మాత్రమే అందిస్తున్నారు. త్వరలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల కోసం అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్టు నెఫ్రాలజీ వైద్యులు తెలిపారు. కొద్ది రోజుల్లోనే ఈ పరికరాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడే నిరుపేద రోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలకు ప్రయివేటు ఆస్పత్రుల్లో లక్షల్లో వెచ్చించాల్సిన పరిస్థితి ఉంది. దీంతో సాధారణ మధ్యతరగతి, నిరుపేద ప్రజలకు ఈ శస్త్రచికిత్స ఖర్చుతో కూడిన వ్యవహారంగా మారింది. ప్రభుత్వం, ఆసుపత్రి అధికారుల చొరవతో సూపర్ బ్లాక్‌లో అత్యాధునిక పరికరాలతో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స అందుబాటులోకి వస్తున్నాయని జీజీహెచ్ నెఫ్రాలజీ విభాగం వైద్యులు తెలిపారు.

### జీజీహెచ్‌కు పెద్ద సంఖ్యలో కిడ్నీ రోగులు

జీజీహెచ్‌లోని సూపర్ బ్లాక్‌లో డయాలసిస్ విభాగం 2022లో ప్రారంభించారు. అప్పటి నుంచి కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి వైద్యం కోసం రోజూ వందల సంఖ్యలో కిడ్నీ సంబంధిత రోగులు వస్తున్నారు. 2023 సంవత్సరంలో 5,556 మంది, 2024లో 7,147 మంది, ఈ ఏడాది ఇప్పటి వరకు 3,263 మంది కిడ్నీ రోగులు ఓపీ సేవలు వినియోగించుకుంటున్నారు. వారానికి మూడు రోజులు(సోమ, బుధ, శని) ఓపీ సేవలు నిర్వహిస్తున్నారు. జీజీహెచ్, సూపర్ స్పెషాలిటీలో మొత్తం 60 డయాలసిస్ బెడ్లు అందుబాటులో ఉన్నాయి. సూపర్ బ్లాక్‌లో 12 డయాలసిస్ మెషీన్లు అందుబాటులో ఉండగా, జీజీహెచ్‌లో 15 ఉన్నాయి. జీజీహెచ్‌లో ఉన్న మెషీన్లు ప్రైవేటు సంస్థ నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వమే ఈ ఖర్చును భరిస్తోందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. రోజూ నాలుగు విడతల్లో, నాలుగు గంటల చొప్పున రోగులకు డయాలసిస్ నిర్వహిస్తున్నట్టు నెఫ్రాలజీ వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విభాగం అందుబాటులోకి రావడం పేదలకు మరింత మేలు చేకూరుతుంది. చుట్టుపక్కల జిల్లాల్లో ప్రభుత్వాసుపత్రిలో కిడ్నీమార్పిడి శస్త్రచికిత్స సేవలు అందుబాటులో లేవని తెలిపారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఈ సేవలు అందుబాటులోకి రానుండడంతో రోగుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉంది.



### నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు

- సీహెచ్ నాగేశ్వరరావు, అసోసియేట్ ప్రొఫెసర్ (నెఫ్రాలజీ)



ఇప్పటివరకు జీజీహెచ్‌లో పేదలకు అన్నివిభాగాల్లో అధిక సంఖ్యలో సేవలు అందిస్తున్నాం. ఇతర జిల్లాల నుంచి కూడా వైద్యం కోసం వస్తున్నారు. డయాలసిస్‌లో రక్తం శుద్ధి చేయడం ఒక పద్ధతి అయితే.. కడుపునకు రంధ్రం చేసి పైపు లిక్విడ్ పంపి శుభ్రపరిచేది మరొక పద్ధతి. రోగుల పరిస్థితి, వారి నిర్ణయాన్ని బట్టి డయాలసిస్ చేస్తాం. కొంతమంది రోగులు కడుపులో పైపు అమర్చుకుని ఇంటి దగ్గరే చేసుకుంటారు. దీనిలో నాలుగు గంటలకొకసారి లిక్విడ్‌తో శుభ్రపరుచుకునే అవకాశం ఉంటుంది. పరిస్థితి విషమంగా ఉన్నవారికి మాత్రం ఆసుపత్రిలోనే రక్తాన్ని శుభ్రపరుస్తాం. సూపర్ బ్లాక్‌లో ప్రతిరోజూ నాలుగు విడతల్లో సుమారు 100 మందికి పైగా డయాలసిస్ చేస్తున్నాం. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో శస్త్రచికిత్స నిర్వహించే అవకాశం రావడంలో ఆసుపత్రి అధికారుల కృషి ఉంది.

# ఆందోళనలపై పరస్పర ఫిర్యాదులు

» వైసీపీ నేతల అరెస్టుకు రంగం సిద్ధం

**మచిలీపట్నం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** మంత్రి కొల్లు రవీంద్ర ఇంటి సమీపంలో ఆందోళనకు దిగిన వైసీపీ కార్పొరేటర్లు, నేతలపై ఇనగుదురుపేట పోలీసులు కేసులు నమోదుచేశారు. మంత్రి ఇంటి వద్ద ఆందోళన చేస్తూ మంత్రి ఫోటోలను చీపుర్లతో కొట్టినందుకు గురువారం కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము తదితరులు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, పర్ణం జ్యోతి, గూడవల్లి నాగరాజు, నోబుల్ థామస్, జోగి చిరంజీవి, మేకల సుధాకర్ (సుబ్బన్న), బూరగ జయశ్రీ, కొలుసు హరిబాబు, షేక్ అచ్చాబా, తుమ్మలపల్లి జగన్నాథరావు, బందెల కవిత, వాసంశెట్టి వాణి కుసుమ, తెనాలి స్వప్న, తిరుమలశెట్టి వరప్రసాద్, ఆటోడ్రైవర్ బాబావలి, టేక్యా సలామ, పేర్ని కిట్టు తదితరులపై కేసులు నమోదు చేశారు. శుక్రవారం ఇనగుదురుపేట సీఐ పరమేశ్వర్ స్టేషన్‌కు వైసీపీ కార్పొరేటర్లు, నాయకులను పిలిపించారు.

### పేర్నినాని దిష్టి బొమ్మ దహనంపై వైసీపీ ఫిర్యాదు

**మచిలీపట్నం టౌన్ :** పేర్నినాని ఇంటి సమీపంలో టీడీపీ నాయకులు ఆందోళన చేయడంతో చిలకలపూడి సీఐ నబీకి వైసీపీ నేతలు గాజుల భగవాన్, మహమ్మద్ రఫీలు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వాసుపత్రికి వెళ్లేదారిలో టీడీపీ కార్యకర్తలు పల్లపాటి సుబ్రహ్మణ్యం, మోటమర్రి బాబాప్రసాద్, కుంచేనాని, లోగిశెట్టి వెంకట స్వామి, సయ్యద్ ఖాజా, దింటకుర్తి సుధాకర్, లంకిశెట్టి నీరజ, కరెడ్ల సుశీల, పాలపర్తి పద్మజ, రత్నారావు, నారగాని కృష్ణ, పామర్తి లక్ష్మణ, నాగబాబు, పిన్నింటి అయ్యప్ప, ఎండీ సలీం, రాయపూడి ప్రసాద్, బండారు గంగాధర రావు, అబ్బాస్ హుస్సేన్, జి.నాగబాబు, ముంతా రవి చంద్ర, బోలెం హరిబాబు, పీవీ ఫణికుమార్, చిట్టూరి యువరాజ్, పద్మనాభుని శేఖర్, వాలిశెట్టి హైమావతి, సమతాకీర్తి, వేము కోటేశ్వరరావు, మరికొంత మంది పెట్రోల్ డబ్బా, అగ్గిపెట్టెలు తెచ్చి పేర్నినాని దిష్టి బొమ్మ దహనం చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వాస్తవాలు విచారించి కేసులు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.



ఇనగుదురుపేట స్టేషన్‌లో వైసీపీ నేతను విచారిస్తున్న పోలీసులు



చిలకలపూడి సీఐ నబీకి ఫిర్యాదు చేస్తున్న వైసీపీ నేతలు

వైసీపీ, టీడీపీ నాయకుల ప్రదర్శనలు, దిష్టిబొమ్మల దహనంపై ఇరువర్గాలు పరస్పరం కేసులు నమోదు చేయడంతో మచిలీపట్నంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.

### నిఘా బృందంపై అసంతృప్తి

వైసీపీ కార్పొరేటర్లు ముందుగా హోంమంత్రి అనిత వచ్చే దారిలో ఆందోళన చేసేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అభ్యంతరం చెప్పారు. కార్లు, ఆటోలపై రావడంపై పోలీసు అధికారులు నిఘా వర్గాలపై ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంమంత్రి మచిలీపట్నంలో ఉండగా ఆందోళన చేయడం చర్చనీయాంశమైంది.




పాల ప్యాకెట్‌పై ఉన్న పవన్‌కళ్యాణ్ పోస్టర్

## అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

» కృష్ణా మిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వర్ బాబు

» పాలప్యాకెట్‌పై హరహర వీర మల్లు సినిమా పోస్టర్‌కు ఖండన

**చిట్టినగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి):** కృష్ణా మిల్క్ యూనియన్‌కు సంబంధించి సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామని కృష్ణా మిల్క్ యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయ పాలప్యాకెట్లపై ఉపముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్‌కల్యాణ్ నటించిన హరహర వీర మల్లు పోస్టర్ పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. ఫోటోషాప్ ద్వారా చేసిన ఇటువంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తూ వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అరవై సంవత్సరాలుగా వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన పాడి రైతుల సంస్థపై ఇటువంటి దుష్ప్రచారం చేయడం సరికాదని, విజయ ఉత్పత్తులపై ఎటువంటి ప్రచారాలు ఎన్నడూ చేయలేదని, చేయబోమని తెలిపారు. ఇటువంటి అవాస్తవ ప్రచారాలు యూనియన్ పరువుకు భంగం కలిగించే అవకాశమున్నందున, ప్రజలు, మీడియా ప్రతినిధులు, వినియోగదారులు ఈ వార్తలను నమ్మవద్దని కొల్లి ఈశ్వర్ బాబు తెలిపారు.

## హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

**విజయవాడ లీగల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** కృష్ణలంక స్టేషన్ పరిధిలో 2023లో ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులపై నేరం రుజువుకావడంతో జీవితఖైదు, రూ.2 వేల జరిమానా విధిస్తూ ఏడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి బి.అబ్రహం శుక్రవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కృష్ణలంకలోని స్వర్గపురి రోడ్డులోని ఇసుక తిన్నెల్లో నిమ్మల శివ పాక వేసుకొని జీవిస్తున్నాడు. ఈ క్రమంలో 2023 నవంబరు 22న పిల్లా స్వామితో గొడవ జరిగింది. అదే రోజు సాయంత్రం 7 గంటల ప్రాంతంలో స్వామి వంటిపై రక్తపు మరకలతో కంగారుగా వెళ్లడం చూసిన శివ బంధువు పాక వద్దకు వెళ్లి చూడగా శివ రక్తపు మడుగులో పడివుండటాన్ని గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసుల విచారణలో సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన పిల్లా స్వామి, తూర్పు గోదావరి జిల్లా మాలికిపురానికి చెందిన తుమ్మల సుబ్బారావు అలియాస్ ఎర్రోడులను నిందితులుగా గుర్తించి అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితులపై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

## బాల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** జాతీయస్థాయిలో 2026 సంవత్సరానికి గాను 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్'ను పొందేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి షేక్ రుక్సానా బేగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడలు, శౌర్యం, సామాజిక సేవ, సైన్సు అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సాంస్కృతిక రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన బాలలకు 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' కేంద్ర ప్రభుత్వం ఇవ్వనుందని తెలిపారు. ఆసక్తి గల బాలలు ఈ నెల 31 లోగా హెచ్‌టీటీపీఎస్://అవార్డు.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు.



తాతినేని శివరామ్‌ను సత్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు సత్యనారాయణ

## బీజేపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా తాతినేని శివరామ్

**మచిలీపట్నం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** ప్రధాని మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు పి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక హోటల్‌లో కృష్ణాజిల్లా బీజేపీ అధ్యక్షుడిగా తాతినేని శివరామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథ రాజు, జిల్లా ఇన్‌చార్జి కబర్ధి, రాష్ట్ర కార్యదర్శి, ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, గుత్తికొండ రాజాబాబు, పంతం గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి తవ్వకాలు

(5వ పేజీ తరువాయి)

తెలుస్తోంది. ఆ అధికారి అండతోనే తాజాగా వారం రోజుల నుంచి బుసక, ఇసుక క్వారీలు తెరిచారు.

### రాత్రి తవ్వకాలు.. పగలు గప్‌చుప్

రొయ్యూరు ఎస్సీ సొసైటీకి చెందిన రైతు బందెల కోటేశ్వరరావు శుక్రవారం విలేకరులను తీసుకెళ్లి సొసైటీ భూముల్లో జరుపుతున్న ఇసుక, బుసక అక్రమ క్వారీలను చూపారు. రాత్రి 9 నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు రెండు ఎక్స్‌కవేటర్లతో లారీల్లోకి లోడింగ్ చేస్తూ అక్రమ రవాణా సాగిస్తున్నారని, ఈ అక్రమ తవ్వకాలకు అధికారుల సహకారం ఉన్నట్టు కోటేశ్వరరావు ఆరోపించారు. రాత్రిపూట తవ్వకాలు జరుపుతూ పగలు ఏమీ జరగనట్టు మభ్యపెడుతున్నారని పేర్కొన్నారు. ఒక ఎక్స్‌కవేటర్‌తో బుసక, మరో ఎక్స్‌కవేటర్‌తో ఇసుక లోడింగ్ జరుపుతున్నారు. రాత్రివేళల్లో భారీగా లారీలు తిరుగుతున్నా కనీసం రెవెన్యూ సిబ్బంది తమకు తెలియదని చెప్పడం ఆశ్చర్యకరం. నీటి ఊటలు బయట పడేలా ఇసుక, బుసక తవ్వకాలు సాగిస్తూ.. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను తుంగలో తొక్కుతున్నా.. అధికారులు గుడ్డిగా వ్యవహరిస్తున్నారు.

### ఎక్స్‌కవేటర్లను బయటకు పంపిస్తా : తహసీల్దార్ కుసుమకుమారి

రొయ్యూరు ఎస్సీ సొసైటీ భూముల్లో ఇసుక, బుసక అక్రమ క్వారీల విషయమై తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరగా, ఈ క్వారీలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. క్వారీలు నడుస్తున్నట్టు తనకు తెలియదన్నారు. క్వారీల వద్ద ఉన్న రెండు ఎక్స్‌కవేటర్లను బయటకు పంపిస్తానని, అవసరమైతే సీజ్ చేయిస్తానని చెప్పారు.

## స్థాయి మరిచారా?

(5వ పేజీ తరువాయి)

చర్చిస్తారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులను సభ్యులు కోరతారు. గతంలో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశం నుంచి వాకౌట్ చేసిన జడ్పీటీసీ సభ్యులు.. శుక్రవారం నాటి స్థాయీసంఘాల సమావేశాలకు అసలు హాజరుకాకపోవడం గమనార్హం.

### డీఆర్వోకు వినతిపత్రం

జడ్పీ స్థాయీసంఘాల సమావేశాలకు డుమ్మాకొట్టిన వైసీపీ జడ్పీటీసీ సభ్యులు వ్యూహాత్మకంగా వ్యవహరించి, గన్నవరం జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణితో శుక్రవారం డీఆర్వో చంద్రశేఖరరావుకు వినతిపత్రం ఇప్పించారు. బీసీ సామాజికవర్గానికి చెందిన మహిళ, జిల్లా ప్రథమ పౌరురాలైన చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై గత శనివారం గుడివాడలో టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని, ఈ ఘటనలో పాల్గొన్న వారిని నేటికీ అరెస్ట్ చేయలేదని ఆమె వినతిలో పేర్కొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాలను పాటిస్తున్న జడ్పీ సీఈవో కన్నమనాయుడు.. జడ్పీ చైర్‌పర్సన్ ఆదేశాలను, సభ్యుల వినతులను పట్టించుకోవడం లేదని, చులకనగా మాట్లాడుతున్నారని, ఈ విషయంపై విచారణ చేపట్టాలని కోరారు.

# వేగంగా వెస్ట్ బైపాస్

» తుదిదశలో గొల్లపూడి-అమరావతి పనులు

» సెప్టెంబరు నాటికి ప్యాకేజీ-4 అందుబాటులోకి

» డిసెంబరుకు ప్యాకేజీ-3 పూర్తయ్యే అవకాశాలు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** విజయవాడ పశ్చిమ బైపాస్‌లో ప్యాకేజీ-4 ముందుగా అందుబాటులోకి రానుంది. సెప్టెంబరులో అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఎన్‌హెచ్ అధికారులు చెబుతున్నారు. గొల్లపూడి నుంచి అమరావతి మీదుగా కాజ వరకు 17.88 కిలోమీటర్ల పొడవున ఆరు వరసల రోడ్డు పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ పనులను రూ.1546.31 కోట్లతో అదానీ, నవయుగ సంస్థలు జాయింట్ వెంచర్‌గా చేపట్టాయి. ప్యాకేజీ-4 గొల్లపూడి ఆర్‌వోబీకి అనుసంధానంగా మొదలవుతుంది. కృష్ణానదిపై 3 కిలోమీటర్ల బ్రిడ్జి నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. రోడ్డు పోర్షన్‌లో మూడు ప్రధాన వంతెనలు, ఐదు ఫ్లై ఓవర్లు, ఒక ఆర్‌వోబీ, ఒక వెహికల్ అండర్ పాస్ (వీయూపీ), 28 కల్వర్టుల పనులు చేపట్టారు. వెంకటాయపాలెంలో ప్రస్తుతం టోల్ గేట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇవి కూడా పురోగతిలో ఉన్నాయి. ప్యాకేజీ-4 పనులు తుదిదశకు చేరుకోవటంతో సెప్టెంబరుకు అందుబాటులోకి తీసుకొస్తామని ఎన్‌హెచ్ అధికారులు చెబుతున్నారు. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ప్యాకేజీ-1 గుండుగొలను నుంచి కలపర్రు వరకు పూర్తయింది. ప్యాకేజీ-2లో కలపర్రు నుంచి చిన్న అవుటపల్లి వరకు, హనుమాన్ జంక్షన్ బైపాస్‌లు పూర్తయ్యాయి. విజయవాడ బైపాస్‌లో భాగంగా చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ప్యాకేజీ-3, గొల్లపూడి నుంచి కాజ వరకు ప్యాకేజీ-4 పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. విద్యుత్ టవర్లు, ఆర్‌వోబీల పునర్నిర్మాణ పనుల కారణంగా ప్యాకేజీ-3 అందుబాటులోకి రావటానికి డిసెంబరు వరకు సమయం పట్టే అవకాశం ఉంది.



## జోరువాన

(5వ పేజీ తరువాయి)

రైతులు రాత్రి, పగలు తేడా లేకుండా కాల్వల వెంబడి తిరిగారు. నీటిమట్టం పెరగకపోవడంతో ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని పొలాలకు మళ్లించే ప్రయత్నాలు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో రైతులు కొంతమేర ఊపిరి పీల్చుకున్నారు. వారం పాటు సాగునీటికి ఇబ్బంది లేదని ఆనందపడ్డారు. కాగా, శనివారం కోస్తాతీరం వెంబడి భారీ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. ఈనెల 23 వరకు ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. జిల్లాలో శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురవగా, గుడివాడలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరింది. గుడివాడ-బంటుమిల్లి రహదారిపై వర్షపునీరు చేరింది. పమిడిముక్కల మండలంలో అత్యధికంగా 97.2 మిల్లీమీటర్లు, బాపులపాడులో అత్యల్పంగా 3.6 మిల్లీమీటర్లు, జిల్లా సగటు వర్షపాతం 30.1 మిల్లీమీటర్లుగా నమోదైంది.

### ఆర్చర్ జ్యోతి సురేఖకు సత్కారం

**విజయవాడ(స్పోర్ట్స్):** ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-4 పోటీల్లో అద్భుతమైన ప్రదర్శన చూపి రజత, కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖను యూనియన్ బ్యాంక్ అధికారులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఆమె నివాసంలో రాష్ట్ర ఎస్ఎల్‌బీసీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోన్ ఎఫ్‌జీఎం సీవీఎన్ భాస్కరరావు, విజయవాడ రీజియన్ హెడ్ ఎంవీ తిలక్‌లు ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన వరల్డ్ కప్ పోటీల్లో సురేఖ బరిలో దిగిన మూడు విభాగాలలో రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకం గెలుచుకోగా, మిక్స్‌డ్ విభాగంలో ప్రపంచ రికార్డ్ సృష్టించింది.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 109, 117, 128 |
| చికెన్ విత్ స్కిన్ | 210 |
| చికెన్ స్కిన్‌లెస్ | 220 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 520

## తొమ్మిది గ్రామాల మీదుగా ఔటర్ రింగ్‌రోడ్డు: తహసీల్దార్

**ఉంగుటూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని తొమ్మిది గ్రామాల మీదుగా ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్‌ఆర్) వెళ్లనున్నట్లు తహసీల్దార్ జాలాది విమలకుమారి అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, కలెక్టర్ డీకే బాలాజీ సూచనల ప్రకారం పెదఅవుటపల్లి, పొట్టిపాడు, ఆత్కూరు, తేలప్రోలు, వెన్నూతల, వెల్దిపాడు, వేంపాడు, తరిగొప్పుల, మానికొండ గ్రామాల మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరగనుందన్నారు. సదరు గ్రామాల్లో ఓఆర్‌ఆర్ ప్రతిపాదనలు అమలులో వున్నందున రైతులు తమ వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చేందుకు ఎటువంటి అనుమతులు ఇవ్వబడవన్నారు. ముఖ్యంగా సాగుభూముల్లో నూతనంగా వెంచర్లు వేసి ప్లాటులుగా విభజించడం, నిర్మాణ పనులు చేపట్టడం, చెరువులుగా మార్చడం వంటివి చేసేందుకు వీలులేదని తహసీల్దార్ స్పష్టం చేశారు.

# సాగునీటి ఇబ్బందులను తొలగిస్తాం

### ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

**గన్నవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** నియోజకవర్గంలో రైతుల సాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. మండలంలోని ముస్తాబాదలో శుక్రవారం సాయంత్రం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి వచ్చిన యార్లగడ్డ ముందుగా రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కూటమి నాయకులు కార్యకర్తలతో కలిసి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటూ వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగునీటి కొరత ఏర్పడిందని దీని నివారణకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కాలువ కింది గ్రామాల్లో సాగునీటి కొరతను తీర్చేందుకు ఏలూరు కాల్వకు గరిష్ఠంగా నీటిని విడుదల చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. పోలవరం కాలువ పరివాహక ప్రాంతంలో తన సొంత నిధులతో అందించిన మోటార్లను ఏర్పాటు చేసుకుని రైతులు సాగునీటి ఇబ్బందులను అధిగమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గూడపాటి తులసి మోహన్, బోడపాటి రవి కుమార్, వేము రాధాకృష్ణ, మేడేపల్లి రమ, కడియాల రాజశేఖర్, కోసరాజు సాయిరాం, కురేటి శ్రీనివాస్, చోడ వరపు వెంకటేశ్వరరావు, పాలడుగు మల్లికార్జునరావు, చాగర్లమూడి యుగంధర్, బోడా దర్మారావు, గుంటూరు ప్రసాద్, కొరివి సురేష్, గొంది నరేంద్ర, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, గూడవల్లి నరసింహారావు, ఆళ్ల గోపాలకృష్ణ, బొప్పన హరికృష్ణ పాల్గొన్నారు.



ముస్తాబాదలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

**రైతులకు మెరుగైన సేవలందించాలి**

**హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** సహకార వ్యవస్థలో రైతులే ప్రధానమని వారి అవసరాలు గుర్తెరిగి విస్తృతంగా సేవలందించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. రంగన్నగూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ కనకవల్లి శేషగిరిరావుకు శుక్రవారం నియామక పత్రాన్ని ఆయన అందజేశారు. రైతులకు సాంకేతిక సహకారంతో కూడిన అత్యుత్తమ సేవలందించేలా కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఎన్‌ఎస్‌ఎల్పీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు సముద్రాల వరప్రసాద్, జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పులిపిరి (సురిడి కాయ) ఆకు పసరుతో మటుమాయం

**కృష్ణా జిల్లా :** అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్స్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



**వైద్యానికి దారి తీసిన విధానం**

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

**19, 20, 21** తేదీల్లో కృష్ణా జిల్లా, బందర్ రోడ్, మనోరమ ప్రక్కన, రెండవ వీధి, హోటల్ తానియా నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (**సైజును బట్టి చార్జి చేయబడును). ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

**మల్లి చేతిలో దివ్యమైన మూలికలు**

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్‌చేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

## పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి

**హనుమాన్‌జంక్షన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. పీ-4 సర్వేలో గుర్తించిన జాబితాలోని అర్హుల ఎంపికపై శుక్రవారం బాపులపాడు పంచాయతీ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో ఎంపీడీవో కె.జోగేశ్వరరావు గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని మూడు సచివాలయాల పరిధిలో గుర్తించిన 846 మంది జాబితాపై గ్రామసభలో చర్చించారు. టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ పంచాయతీ కార్యదర్శి సంపూర్ణేశ్వరి, వార్డు సభ్యులు మరియమ్మ, తాడిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న టీడీపీ నేత రాజేశ్వరరావు



పైప్‌లైన్ మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, ఇన్‌చార్జి సెక్రటరీ

## పైప్‌లైన్ లీకేజికి మరమ్మతులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

**ఉయ్యూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** ఆకునూరులో పైప్‌లైన్ లీక్ మరమ్మతు పనులకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల సమీపాన తాగునీటి పైప్‌లైన్ లీకై వారం రోజులుగా నీరు వృథా అవుతున్న వైనాన్ని పైప్‌లైన్ లీక్ - తాగునీరు వృథా శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఈవో పీఆర్డీ కోటేశ్వరరావు, ఇన్‌చార్జ్ కుమార్ లీకవుతున్న పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు.

## వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్టు

**కంకిపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** వృద్ధురాలిని హత్య చేసి పరారైన వ్యక్తిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచినట్లు గన్నవరం రేంజ్ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శుక్రవారం హంతకుడిని మీడియా ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, మండలంలోని మంతెనకు చెందిన తిరుమల స్వర్ణకుమారి ఈ నెల 13న ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన తిరువీధుల భవానీప్రసాద్ ఇంట్లోకి చొరబడి కత్తితో దాడికి చేసి హతమార్చాడు. మెడలోని బంగారు గొలుసు అపహరించుకొని పరారయ్యాడు. సమాచారం అందుకున్న సీఐ మురళీకృష్ణ, ఎస్సైలు డి. సందీప్, తాతాచార్యులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు అదే గ్రామానికి చెందిన భవానీ ప్రసాద్‌ను అదుపు లోకి తీసుకున్నారు. ఈ కేసును పరిష్కరించటంలో శ్రమించిన సీఐ మురళీకృష్ణ, ఎస్సైలు డి. సందీప్, తాతాచార్యులు, సురేష్, సిబ్బంది చంద్రబాబు, పి ప్రసాద్, బాజిబాబు, మూర్తి, అశోక్, నాగబాబు, గోపి, వెంకటేశ్వరరావు, మురార్జిలను డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గన్నవరం రేంజ్ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, సీఐ మురళీకృష్ణ, ఎస్సైలు

**పశుగ్రాసం పెంపకానికి..**

బహు వార్షిక పశుగ్రాసాల పెంపకానికి ప్రభుత్వం అందించే ఆర్థిక సహకారం పొందడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పశుసం వర్ధక శాఖ బాపులపాడు ఏడీ ఎం.ప్రమీలరాణి తెలిపారు.



విద్యుత్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి విక్టర్ ఇమ్మానుయేల్

## విద్యుత్ వాడకంపై అవగాహన

**విజయవాడ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని నున్నలో శుక్రవారం విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు జరిగింది. స్థానిక స్వప్న ఫంక్షన్ హాల్‌లో జరిగిన సదస్సుకు ఫార్మర్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్. విక్టర్ ఇమ్మానుయేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు, వినియోగదారులకు విద్యుత్ వాడకంపై అవగాహన కల్పించారు. అలాగే విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా పలు జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో ఈఈ పి. హరి బాబు, నున్న సబ్ స్టేషన్ ఏఈ శివారెడ్డి పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ అనర్థాలపై..

**ఉయ్యూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** ప్లాస్టిక్ వినియోగంవల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మూడవ శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్న సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శాకాంబరీగా వెంకమ్మ పేరంటాలు



**ప్రసాదంపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి):** వెంకమ్మ పేరంటాలు అమ్మవారు శాకాంబరీ దేవిగా శుక్రవారం దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని పండ్లు, కూరగాయలతో అలంకరించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రతేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఎమ్మెల్యే దపంతులకు వేదాశీర్వాచనం అందజేశారు. ఈవో ప్రియాంక సర్పంచ్ వరి శ్రీదేవి, సాంబ శివరావు, కొల్లా ఆనంద్, కళ్లేపల్లి రామరాజు రవి పాల్గొన్నారు.

**ఉంగుటూరు :** మండలంలోని వెల్దిపాడు గ్రామానికి చెందిన మహిళా భక్తులు శుక్రవారం విజయవాడ కనకదుర్గ అమ్మవారికి సంప్రదాయబద్ధంగా ఆషాఢసారె సమర్పించారు. గోవింద నామ ప్రచార సేవాసంఘం-సేవాభారతి ఆధ్వర్యంలో ఉదయం స్థానిక శ్రీకోదండరామస్వామి ఆలయం నుంచి పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, పూలు. పండ్లతో విజయవాడకు వెళ్లి దుర్గమ్మను దర్శించి భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు.

**హనుమాన్‌జంక్షన్ :** స్థానిక సత్య సాయిబాబా మందిరంలో శుక్రవారం ఆషాఢమాసం పురస్కరించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. గాయత్రీదేవికి అభిషేకాలు, పూజలు నిర్వహించి ఆషాఢ సారె సమర్పించారు. మందిరం కన్వీనర్ బెక్కం వెంకట్వేశ్వరరావు, మందిరం నిర్వాహకులు కోసూరు సుకుమార్, మామిడి రాము, చలమలశెట్టి వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి కృష్ణ, నందూరు వేణు, పువ్వాడ ఫణి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** ఆరుగొలను సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుడివాడ ఏఈ జి.బి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు గొలను, ఓగిరాల, కురిపిరాల, సిరివాడ, తిప్పనగుంట, కాను మోలు, రంగయ్యప్పారావుపేట, కాకులపాడు, రామన్నగూడెం, వైకుంఠలక్ష్మీపురం గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 11గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**ఉంగుటూరు :** ఉంగుటూరు సెక్షన్, 33/11కేవీ నందమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏరియాలోని మానికొండ ఫీడర్ ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం మానికొండలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**కానూరు :** కానూరు సబ్‌స్టేషన్ 11 కేవీ భాగ్యనగర్ ఫీడర్ మరమ్మతుల్లో భాగంగా కానూరు సెక్షన్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల విద్యుత్ శాఖ ఈఈ పి. హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్ఆర్ కాలనీ, హరిజనవాడ, ఎస్‌బీఐ కాలనీ, రాజ్‌కమల్ బిల్డింగ్ ఏరియా, కానూరు మెయిన్‌రోడ్డు, సెయింట్ థెరిసా స్కూల్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**ప్రసాదంపాడు :** రాజుల బజార్ 11కేవి ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 వరకు ప్రసాదంపాడులోని రాజుల బజార్, సాయిబాబా టెంపుల్ ప్రాంతం, బీఎస్ఎన్ఎల్ టవర్ ప్రాంతం, రామ వరప్పాడు రింగ్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడునుందని ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## కృత్రిమ కాలు అందజేత

**గన్నవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** గన్నవరం పట్టణానికి చెందిన కొనకళ్ల రామతులసికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కృత్రిమ కాలును శుక్రవారం అందజేశారు. అనారోగ్య కారణాల వల్ల కాలును ఆమెకు తీసివేయగా, మానవతా సేవా సంస్థ ప్రతినిధులకు తన గోడు విన్నవించుకొంది. స్పందించిన సభ్యులు రూ. 22 వేలు విలువైన కృత్రిమ కాలును తోటపల్లి హీల్ ప్యారడైజ్‌లో చేయించి అందజేశారు. వీవీ కృష్ణమోహన్ వీసం ప్రసాదరావు, మడుపల్లి బాలకృష్ణమూర్తి, కర్రా వరప్రసాదరావు, వడ్లమూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీలో వైభవంగా ఫ్రెషర్స్ డే

**కానూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూని వర్సిటీలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు వైభవంగా జరిగాయి. భారతీయ సంప్రదాయాలు, కళలను ప్రతిబింబించే పలు రకాల నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ విద్యార్థి దశే భవిష్యత్ స్థాపనకు పునాదని, ఉద్యోగాల సాధనలో ముందుకు సాగాలంటే సాంకేతిక నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. సిద్ధార్థ వర్సిటీ వీసీ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతికతను నేర్చుకోవడంతో పాటు మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ డీన్ డి. వెంకట్రావు, ప్రొఫెసర్ వీసీ ఏవీ రత్నప్రసాద్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కన్సల్టెన్సీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. పాండురంగారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. రవిచంద్‌తోపాటు పలు స్కూళ్ల డీన్‌లు పాల్గొన్నారు.



వేడుకల్లో విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

## ప్రాధాన్యతాక్రమంలో గ్రామాల అభివృద్ధి

### సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

**కంకిపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** ప్రాధాన్యతాక్రమంలో గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని చలివేంద్రపాలెంలో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, చలివేంద్రపాలెం అభివృద్ధికి ఉపాధి హామీ నిధులు, పంచాయతీ నిధులతో పాటు మండల పరిషత్ నిధులు రూ. 56లక్షలు కేటాయించామని, నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు రూ. 76 కోట్లతో అభివృద్ధి పనులు చేసి చూపించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భవన్నారాయణ, ఎంపీడీవో అనూష, ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, శ్రీనివాసరావు, సెంగెపు రంగారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

**జగన్ చేసిన పాపాలు ప్రజల పాలిట శాపాలు: వైవీబీ**



**ఉయ్యూరు :** కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నప్పటికి ఐదేళ్ల పాలనలో జగన్ చేసిన పాపాలు ప్రజల పాలిట శాపాలుగా మారాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. ఉయ్యూరు 17వ వార్డులో శుక్రవారం పర్యటించి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి అన్ని సౌకర్యాలతో లబ్ధిదారులకు అందిస్తుందన్నారు. చైర్మన్ వి.సత్యనారాయణ, గుర్నాధరావు, వాసు, ఫణి, పాల్గొన్నారు.



● వైసీపీ అసమర్థ, అవినీతి పాలనతో అధోగతిపాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలోకి తీసుకు వచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చుతుందని జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పాలడుగు సత్యనారాయణ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ముదునూరులో పర్యటించి చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటా ప్రచారం చేశారు. సర్పంచ్ మొవ్వ వెంకట నాగలక్ష్మి, పల్లపోతు శ్రీనివాసరావు, పామర్తి నాగరాజు, హరీశ్, అజయ్, రవితేజ పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లు.. పేదలకు ఉరితాళ్లు : సీపీఎం

**ఉయ్యూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :** స్మార్ట్ మీటర్లు.. పేదలకు ఉరితాళ్లు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆరోపించారు. ట్రూఅప్ సర్దుబాటు పేరుతో ప్రజలపై విద్యుత్ భారం మోపడం, స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం ఉయ్యూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సుందరమ్మపేటలో పార్టీ నాయకులతో కలసి ఇంటింటా ప్రచారం చేశారు. పార్టీ నాయకులు వై. వెంకటేశ్వరరావు, వై. నరసింహారావు, మాదాల వెంకటేశ్వరరావు, శివనాగేంద్రం, రాజేశ్, అన్నే సుబ్బారావు, నెమ్మాది గోపాల్, కీర్తి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారంలో సీపీఎం నేతలు

## నైపుణ్యం పెంపుతోనే ఆర్థిక పురోగతి

**● నీతి ఆయోగ్ సభ్యుడు అరవింద్ విర్మానీ**



ముఖాముఖి సమావేశంలో మాట్లాడుతున్న నీతి ఆయోగ్ సభ్యుడు అరవింద్ విర్మానీ

గాంధీనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ లక్ష్య సాధనకు నీతి ఆయోగ్ కృషి చేస్తుందని నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ అరవింద్ విర్మానీ అన్నారు. గాంధీనగర్‌లోని విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యాలయంలో చాంబర్ సభ్యులు, వ్యాపార, వాణిజ్య వర్గాల ప్రముఖులతో శుక్రవారం ముఖాముఖి కార్యక్రమం జరిగింది. అరవింద్ విర్మానీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చదువుకున్న వారిలో ఆయా రంగాల్లో నైపుణ్యత, ప్రావీణ్యం లేకపోవడం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. విద్యతో పాటు ఆయా రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తద్వారా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకోవడంతో ఆయా రంగాల్లో దేశం పురోగతి సాధిస్తుందన్నారు. జీఎస్టీ ముందు, జీఎస్టీ తర్వాత తాము ఎదుర్కొంటున్న సమస్యలను చాంబర్ సభ్యులు, వర్తకులు ఆయన దృష్టికి తీసుకురాగా వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. చాంబర్ అధ్యక్షుడు గద్దం బాల వెంకట రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ సాంబయ్య, చాంబర్ ఉపాధ్యక్షులు వీవీకే.నరసింహారావు, దర్శి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ శ్రీకాంత్, కోశాధికారి తమ్మన శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు ఈమని దామోదర్, బాలకిషన్ లోయ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరవింద నిర్మానీని ఘనం గా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

## సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పట్టుపవిత్రాల సమర్పణ



మోపిదేవి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పవిత్ర ఉత్సవ సహిత ఆషాడ కృతిక మహోత్సవంలో భాగంగా రెండో రోజు శుక్రవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. గోపూజ, సుప్రభాత సేవ, నిత్య అర్చన, నవ కుంభారోపణ, ఏకాదశ ద్రవ్యాభిషేకం, అన్నాభిషేకం, సుబ్రహ్మణ్య మూలమంత్ర హవనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూలమూర్తులు, ఉత్సవ మూర్తులకు పట్టు పవిత్రాలను సమర్పించి విశేష అలంకరణ చేశారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో సహాయక ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాపులో మాట్లాడుతున్న సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు

## అమరావతిని హరిత రాజధానిగా తీర్చిదిద్దుతాం

**● సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు**

విజయవాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజారాజధాని అమరావతిని దేశంలో ఆదర్శమైన హరిత రాజధానిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఆర్డీఏ పని చేస్తోందని సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు అన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ)తో ఏపీ సీఆర్డీఏ ఆధ్వర్యంలో శుక్రవారం సంయుక్తంగా నిర్వహించిన కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాపులో కమిషనర్ కన్నబాబు మాట్లాడారు. స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యసాధనలో భాగంగా 2040 నాటికి వాయు ఉద్గారాలను శూన్యం చేసే లక్ష్యాన్ని సాధించేలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా సీఆర్డీఏ పనిచేస్తుందన్నారు. రాజధానిలోని ప్రతి ప్రాజెక్టులో సుస్థిరాభివృద్ధి పద్ధతులను అనుసరిస్తున్నామన్నారు. అమరావతిలో నిర్మించిన ఏపీ సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయం దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. అమరావతి నిర్మాణంలో ఐజీబీసీ భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. అమరావతి మాస్టర్‌ప్లాన్‌కు 2018లోనే ఐజీబీసీ గ్రీన్‌సిటీ ప్లాటినం రేటింగ్ ఇచ్చిందని, దేశంలోనే మొట్టమొదటిసారిగా డిజైన్ దశలోనే ఈ రేటింగ్ సాధించిన నగరంగా అమరావతి నిలిచిందని కమిషనర్ గుర్తుచేశారు. ఐజీబీసీ అమరావతి చాప్టర్ ఛైర్మన్ మేకా విజయ్‌సాయి మాట్లాడుతూ, ఏపీ సీఆర్డీఏ నిర్మిస్తోన్న ప్రాజెక్టుల్లో ఐజీబీసీ గ్రీన్ రేటింగ్‌ను అనుసరించడం ద్వారా రాష్ట్రం ముందడుగు వేసిందన్నారు. వర్క్‌షాపులో సీఆర్డీఏ చీఫ్ ఇంజినీర్, ప్లానింగ్ డైరెక్టర్, పర్యావరణ డైరెక్టర్ సహా 50 మందికి పైగా సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## రాజధాని రైతుల ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న నోడల్ అధికారి పి.జయశ్రీ

కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. భూసమీకరణ, వార్షిక కౌలు చెల్లింపు తదితర సమస్యల గురించి రాజధాని ప్రాంత వాసులు తమ అర్జీలను నోడల్ అధికారి పి.జయశ్రీకి అందజేశారు. సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని నోడల్ అధికారి అర్జీదారులకు తెలియజేశారు. ఫిర్యాదులలో అధిక శాతం అక్కడికక్కడే పరిష్కరించారు. గ్రీవెన్స్ డేలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి.సాయి శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, కె.ఎస్.భాగ్యరేఖ, పి.పద్మావతి, జి.రవీందర్, జి.భీమారావు, ఏజీ చిన్నికృష్ణ, సీఆర్‌డీఏ సర్వే విభాగ అసిస్టెంట్ డైరక్టర్ జి.పాండురంగారావు, రామకృష్ణన్, సీఆర్‌డీఏ సామాజిక సంక్షేమ విభాగం డీసీడీఓ బి.శ్రీనివాసరావు, తహసిల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బీసీలపై నానీలకు కపట ప్రేమ

**● గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ గురుమూర్తి**



మచిలీపట్నం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మంత్రులుగా పని చేసిన పేర్ని నాని, కొడాలి నాని వైసీపీ ఐదేళ్లపాలనలో బీసీలను వేధించి, ఇప్పుడు కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని గౌడ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ వీరంకి గురుమూర్తి ధ్వజమెత్తారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని టీడీపీ నాయకుల పట్ల అసభ్యకరంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. గతంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికతో విభేదించిన పేర్ని నాని ఇప్పుడు బీసీ కార్డు తీసుకురావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. శాంతి భద్రతల దృష్ట్యా గుడివాడ సభకు ఎవర్నీ పోలీసులు అనుమతించలేదని, అయినప్పటికీ నాటకీయంగా జడ్పీ ఛైర్‌పర్సన్ గుడివాడకు వెళ్లి లేనిపోని ఘర్షణ వాతావరణం సృష్టించారని విమర్శించారు. వైసీపీ పాలనలో బీసీలపై హత్యలు, దాడులకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌతు లచ్చన్న మనవరాలు శిరీషను ఎన్నో ఇబ్బందులు పెట్టారన్నారు. అమర్‌నాథ్ గౌడ్‌పై పెట్రోల్ పోసి తగలపెట్టారన్నారు. గుడివాడలో కఠారి ఈశ్వర్ కుమార్ వైసీపీ నాయకులతో చేతులు కలపడం ఆశ్చర్యంగా ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల బోసుబాబు, బత్తినదాసు, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణప్రసాద్, బీసీ సంఘ నాయకులు గోకుల శివ, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, కట్టా అంజిబాబు, వంకా వెంకటేశ్వరరావు, మాధవ పాల్గొన్నారు.

## పెళ్లికి నిరాకరించాడని యువతి ఆత్మహత్య

ఉయ్యూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించాడని మనస్తాపంతో మోతాదుకు మించి మందు బిళ్లలు మింగి యువతి ఆత్మహత్య చేసుకుంది. ఉయ్యూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చినఓగిరాలకు చెందిన ఓగిరాల సుధ (22) బీటెక్ పూర్తి చేసి ఇంటివద్ద ఖాళీగా ఉంటోంది. సంవత్సరం క్రితం నెప్పల్లికి చెందిన డొక్కు జితేంద్రతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వేర్వేరు కులాల కారణంగా జితేంద్ర తలిదండ్రులు వీరి ప్రేమను నిరాకరించారు. ఈక్రమంలో జితేంద్ర దూషించడంతో మనస్తాపం చెందిన సుధ గురువారం రాత్రి మోతాదుకు మించి మందుబిళ్లలు మింగింది. కుటుంబ సభ్యులు ఆమెను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందింది. తల్లి భవాని ఫిర్యాదు మేర కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

# అధికారులకు పట్టని వేదాద్రి

**● మోటార్ల మరమ్మతులకు సొంత ఖర్చుతో శ్రమిస్తున్న రైతులు ● ఏమాత్రం స్పందించని అధికారులు ● సీఎం చంద్రబాబును కలిసేందుకు రైతుల సమాయత్తం**

**ఐదేళ్లుగా వైసీపీ విధ్వంస పాలనతో దెబ్బతిన్న వేదాద్రి ఎత్తిపోతలను బాగు చేసుకోవాలన్న ఆరాటంతో రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. కొండంత పనికి గోరంత సాయం కూడా అందకపోయినా సాగునీటి సంఘాలు అలుపెరగని పోరాటం చేస్తున్నాయి. ఒక వైపు పథకానికి సొంత ఖర్చుతో మరమ్మతులు చేసుకుంటూనే మరో వైపు అధికారులకు విజ్ఞప్తులు అందిస్తూ సాగునీటి సంఘాలు ముందుకు సాగుతున్నాయి. ఎన్ఎస్‌పీ, ఐడీసీ ఉన్నతాధికారులతో పాటు ఏపీ ఎస్ఐడీసీ ఛైర్మన్, ట్రాన్స్‌కో సీఎండీలను కలిసి సాయం కోరారు. ప్రతి ఒక్కరూ సానుకూలంగా స్పందిస్తున్నారు తప్ప సాయం అందించిన దాఖలాలు లేవు.**



ప్రమాదవశాత్తు కింద పడి ధ్వంసమైన జనరేటర్



సబ్‌స్టేషన్ వద్ద జరుగుతున్న పనులు



రైతుల కృషితో సిద్ధమైన మోటారు

(ఆంధ్రజ్యోతి - నందిగామ)

వేదాద్రి ఎత్తిపోతల పథకం పని చేస్తే తప్ప రైతులు సాగు చేపట్టే సాహసం చేయలేక పోతున్నారు. సాగర్ ఆయకట్టులో ఉన్న 17వేల ఎకరాలకు మూడు దశాబ్దాలుగా నీరు అందడం లేదు. కేవలం వేదాద్రి ఎత్తిపోతల పథకమే వారికి ఆశాకిరణం. ముఖ్యమంతి స్వయంగా హామీ ఇచ్చినా నిధులు విడుదలలో జాప్యం వారిని అసహనానికి గురిచేస్తోంది. నాలుగింట ఒక మోటారైనా పని చేయించాలని సాగునీటి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. 14 రోజులుగా పడుతున్న కష్టానికి అధికారులు సాయం అందించకపోవడంతో రైతులు మండిపడుతున్నారు.

వేదాద్రి ఎత్తిపోతల పథకం నాలుగు మోటార్లు పని చేయకపోవడంతో ఐదేళ్ల క్రితం వైసీపీ పాలకులు మూసివేశారు. ఆయకట్టు రైతులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. తెలంగాణా నుంచి రావల్సిన సాగర్ నీరు కూడా అందక ఏటా పంటలు దెబ్బతింటున్నాయి. కూటమి అధికారంలోకి రావడం, ఎన్ఎస్‌పీ కాలువలకు సాగునీటి సంఘాలను నియమించడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. ఆనం దం ఎంతో కాలం నిలువలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు మరమ్మతులకు నిధులు ఇస్తానని ప్రకటించినా, విడుదలలో జాప్యం ఏర్పడింది. గతం లో స్కీమును నిర్వహించిన పవర్ టెక్ కంపెనీ ఇంజనీర్ల సాయంతో ఒక మోటారు పని చేసే అవకాశం ఉందని తెలుసుకొని ఎత్తిపోతల పథకాన్ని శుభ్రం చేశారు. రూ.21 కోట్ల బకాయి ఉండడం వల్ల విద్యుత్ పునరుద్ధరించలేమని అధికారులు చెప్పడంతో నీరు గారిపోయారు. అయినా పట్టు విడకుండా రోజుకు రూ.8వేలు అద్దె చెల్లించి జనరేటర్ ఏర్పాటు చేసుకొని మోటారుకు మరమ్మతులు చేయించారు. పంప్ సెట్‌కు కావల్సిన పనిముట్ల కోసం రూ.3 లక్షలు సమీకరించుకొని ముంబైలోని కంపెనీకి ఆర్డర్ పెట్టారు. ఆ పనిముట్లు వస్తే ఒక మోటారు సిద్ధం. చేసుకోగలుగుతారు. ఇప్పటికే సుమారు రూ.20 లక్షల రూపాయల వరకూ సమీకరించి ఖర్చు చేశారు. మోటారు సిద్ధమైనా విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తే తప్ప వారి కష్టానికి విలువ ఉండదు. ఏటికి ఎదురీదుతున్న అన్నదాతలు ఏ తీరం చేరతారో వేచి చూడాల్సి ఉంది. ఒక వైపు పథకానికి మరమ్మతులు చేసుకుంటూనే మరో వైపు అవకాశం దొరికినప్పుడల్లా అధికారులకు విజ్ఞప్తులు అందిస్తూ సాగునీటి సంఘాలు ముందుకు సాగుతున్నాయి. ఎన్ఎస్‌పీ, ఐడీసీ ఉన్నతాధికారులతో పాటు ఏపీఎస్ఐడీసీ ఛైర్మన్, ట్రాన్స్‌కో సీఎండీలను క లసి సాయం కోరారు. ప్రతి ఒక్కరూ సానుకూలంగా స్పందిస్తున్నారు తప్ప సాయం అందించిన దాఖలాలు లేవు.

### నిమ్మకు నీరెత్తినట్లు అధికారుల వైఖరి

ఆయకట్టు రైతులు 14 రోజులుగా ఎత్తిపోతల పథకం వద్ద పడిగాపులు కాస్తుంటే ఐడీసీ, ఎన్ఎస్‌పీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విస్మయాన్ని కలిగిస్తుంది. కనీసం కన్నెత్తి చూడకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 17వేల ఎకరాలు, దాదాపు ఐదు వేల కుటుంబాలు, మరో ఐదు వేల కుటుంబాల కూలీలు ఆశగా ఎదురు చూస్తున్న ఈ పథకం విషయంలో ఎందుకింత నిర్లక్ష్యం జరుగుతుందని చర్చించుకుంటున్నారు. ఈ పరిణామలపై ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందని ఆయకట్టు రైతులు అంటున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని, పథకం పూర్తి మరమ్మత్తులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. రైతులు నేరుగా సీఎం చంద్రబాబును కలిసేందుకు సమాయత్తమౌతున్నారు.

## బీజేపీకి కలిసొచ్చిన అదృష్టం

**● నేతల మధ్య సమన్వయ లోపం**
**● టీడీపీ చేజారిన నందిగామ ఏఎంసీ ఛైర్మన్ పదవి**
**● నియోజకవర్గ బీసీ నేతల ఆగ్రహం**

(ఆంధ్రజ్యోతి-నందిగామ)

పిట్ట పోరు, పిట్ట పోరు పిల్లి తీర్చిందన్న చందంగా నేతల మధ్య సమన్వయ లోపం, అభ్యర్థి ఎంపికలో జాప్యం కారణంగా ప్రతిష్టాత్మకమైన నందిగామ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పీఠాన్ని టీడీపీ చేజార్చుకుంది. పొత్తు ధర్మంలో భాగంగా టీడీపీ అధిష్ఠానం నందిగామ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని బీజేపికి కేటాయించింది. ఛైర్మన్‌గా బీజేపీ నేత పిట్టల శ్రీదేవి పేరును అధిష్ఠానం ప్రకటించడంతో ఆశావహులతో పాటు టీడీపీ, బీజేపీ నాయకులు అవాక్కయ్యారు.

ఎమ్మెల్యే పదవి తరువాత నియోజకవర్గ స్థాయిలో చెప్పుకోదగిన పదవిగా నందిగామ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని చెప్పుకుంటారు. ఎవరు అధికారంలో ఉన్నా ఆ పదవి కోసం పెద్దయెత్తున ఆయా పార్టీల నాయకులు ఆరాట పడుతుంటారు. నాలుగు దశాబ్దాల తరువాత తొలి సారిగా మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని బీసీలకు కేటాయించారు. యార్డు పరిధిలోని నందిగామ, చందర్లపాడు మండలాలలో బీసీ సామాజిక వర్గం బలంగా ఉంది. మెజారిటీ బీసీలు టీడీపీకి అండగా ఉంటూ వస్తున్నారు. అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని బీసీ నేతలు ఉబలాట పడ్డారు. ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే సౌమ్య మధ్య సమన్వయ లోపం వల్ల ఛైర్మన్ పేరును ఖరారు చేయడంలో జాప్యం జరిగిందని, సకాలంలో ప్రతిపాదిత పేరును అధిష్ఠానానికి పంపక పోవడం వల్లనే టీడీపీ దీనిని చేజార్చుకోవాల్సి వచ్చిందన్న భావనలో నియోజకవర్గ పార్టీలో నెలకొంది. తమకు కాకుండా బీజేపీకి ఇవ్వడం పట్ల టీడీపీ బీసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మెగా జాబ్‌మేళాను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ

## క్వాంటమ్ వ్యాలీతో యువతకు ఉజ్వల భవిష్యత్

**మెగా జాబ్‌మేళాలో ఎంపీ కేశినేని శివనాథ్**

మొగల్రాజపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు దార్శనికతకు ప్రతిరూపం క్వాంటమ్ వ్యాలీతో యువతకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, కేశినేని ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పీబీ సిద్దార్థ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్‌తో కలిసి ఆయన జ్యోతి వెలిగించి మెగా జాబ్‌మేళాను ప్రారంభించారు. ఉద్యోగాల కల్పనతో పాటు ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలనే ఉద్దేశంతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా పెద్ద ఎత్తున శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విజయవాడకు ట్రేడ్ సిటీగా పేరు ఉందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రూ.500 జీతంతో కెరీర్ ప్రారంభించి ఎంట్రపెన్యూర్‌గా, రాజకీయ నేతగా ఎదిగారన్నారు. కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ విజయవాడలో ప్రతిభకు కొదవలేదన్నారు. అవకాశాలు అందిపుచ్చుకుని ఉద్యోగాలు సాధించాలని యువతకు పిలుపు ఇచ్చారు. కలెక్టరేట్‌లోను ఎన్టీఆర్ వికాస ద్వారా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని నిరుద్యోగులు ఎపుడైనా వచ్చి పేర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ప్రతినియోజకవర్గంలో జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తూర్పుఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. ప్రభుత్వ విధానాలతో లక్షల కోట్ల పెట్టుబడులతో పెద్ద పెద్ద కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయని చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యం పెంపొందిం చుకోవాలన్నారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి సీహెచ్. మధుభూషన్‌రావు, మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. జాబ్‌మేళాలో 35కు పైగా సంస్థలు, దాదాపు వెయ్యి మంది అభ్యర్థులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్

మచిలీపట్నం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ తేదీ ప్రాతిపదికగా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ జేఏసీ జనరల్ సెక్రటరీ కెఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ధర్నాలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కెఎస్ఎస్‌ప్రసాద్ మాటాడుతూ, డీఎస్సీ- 2003 నోటిఫికేషన్ నియామక ప్రక్రియ 2005 నాటికి పూర్తయిందని, ఇది అభ్యర్థుల తప్పిదం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం 2019లో జారీ చేసిన నెం.57 ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలన్నారు. 2004 సెప్టెంబరు ముందు నోటిపై చేసిన ఉద్యోగ , ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమ లు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం దిగిరాని పక్షంలో విజయవాడలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామన్నారు. ఫోరం రాష్ట్ర కన్వీనర్లు కె.ఎల్.శ్రీనాథ్, తమ్ము నాగరాజు, డీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీనివాస్, ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి సి.ఎం దాస్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఎ.ఉమామహేశ్వరరావు, ఫోరం రాష్ట్ర కన్వీనర్లు సతీష్, నయీం, జిల్లా కన్వీనర్లు మహిపాల్, జయరాజ్, రుషిధి, రమేష్, మెహరున్నీసా, వివిధ సంఘాల నాయకులు రాంబాబు, సత్యనారాయణమూర్తి, మల్లికార్జునరావు, సుధాకర్, వెంకటేశ్వరరావు, గణేష్, శర్మ, శాంతి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## నిదీష్ ఆచూకీ కోసం నాలుగు బృందాల ఏర్పాటు



తోట్లవల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రొయ్యూరులో ఏడు రోజుల క్రితం కన్పించకుండా పోయిన పడమట నిదీష్ (10) ఆచూకీ కోసం డిఎస్పీ ధీరజ్ వినీల్ శుక్రవారం నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. నిమ్మకూరు సర్పంచ్ పడమట దుర్గా శ్రీనివాసరావు కుమారుడు నిదీష్‌ని, కుమార్తెను ఈనెల 12న మేనమామ వీరంకి బాలకృష్ణ రొయ్యూరు తీసుకురాగా, అదేరోజు నిదీష్ అదృశ్యమయ్యాడు. ఏడు రోజులుగా పోలీసులు అనేక విధాలుగా గాలించినా నిదీష్ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. నిదీష్ మిస్సింగ్ కేసును పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవటంతో శుక్రవారం డిఎస్పీ నాలుగు బృందాలను ఏర్పా టు చేశారు. సెల్ టవర్ల డంప్స్‌లో ఫోన్‌కాల్స్ పరిశీలనకు సీఐ వై చిట్టిబాబు ఆధ్వర్యంలో ఇద్దరు కానిస్టేబుళ్లతో ఒక బృదం, కాలువల వెంట డ్రోన్‌లతో గాలించేందుకు ఎస్సై అవినాష్‌తో రెండో బృందం,, రొయ్యూరు నుంచి విజయవాడ, తాడేపల్లి, ఆటోనగర్ వరకు వెదికేందుకు ఒక హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌తో మూడో బృందం, ఆటోనగర్ నుంచి బందరు రోడ్డు వెంట పామర్రు వరకు వెదికేందుకు ఒక హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌తో నాలుగో బృందాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు.

## వైసీపీ నాయకుడు అల్లం ఫౌండ్రీలో విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

**● మరొకరి పరిస్థితి విషమం**



తీవ్రంగా గాయపడిన రాంబాబు

గుడివాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ ఆటోనగర్‌లోని వైసీపీ నాయకుడు అల్లం రామ్మోహనరావుకు చెందిన శ్రీజయలక్ష్మీ ఇంజినీరింగ్ వర్క్స్‌లో శుక్రవారం వెల్డిం గ్ పని చేస్తుండగా విద్యు దాఘాతానికి గురై పెద ఎరుకపాడుకు చెందిన వర్రె జయరాజు(52) మృతి చెందాడు. మరో కార్మికుడు గల్లా రాంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. రాంబాబును తొలుత స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంలో విజయవాడకు తరలించినట్లు సమాచారం. జయరాజు భార్య నాలుగు నెలల క్రితం మృతి చెందింది. జయరాజు మృతితో కుటుం బం రోడ్డున పడింది. ఫౌండ్రీలో విద్యుత్ వైర్లు అస్తవ్యస్తం ఉండడం వల్లే ప్రమాదం జరిగిందని కార్మికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వి.జాస్మిన్ తెలిపారు.

## హస్త కళాకారులను ప్రోత్సహించాలి

**● బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మధుకర్**

విజయవాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : హ్యాండ్లూమ్ రంగానికి భారతదేశం తల్లి వంటిదని బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నూకల మధుకర్ అన్నారు.

బందరు రోడ్డులో ఐదు రోజులు పాటు జరిగే ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పోను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 14 రాష్ట్రాల హస్తకళాకారుల చేతిలో రూపుదిద్దుకున్న అద్భుతమైన డిజైన్లతో ప్రదర్శించిన ఎక్స్‌పో మహిళలకు చక్కని అనుభూతినిస్తుందన్నారు. ప్రతి రాష్ట్రానికి తమకంటూ ప్రత్యేకమైన కాటన్, సిల్క్ వస్త్ర సంప్రదాయాలు ఉన్నా యన్నారు. తెలుగునాట వివాహాలకు అలంకరించే ఉప్పాడ, ధర్మవరం వస్త్రాలకు శుభ వస్త్రం అనే పేరుందన్నారు. తమిళనాడుకు కాంచీ పట్టు దేశంలోనే ఖ్యాతి పొందిందన్నారు. బంగారు జరీబోర్డర్‌లు, దేవతా ఆలయాల ప్రేరణతో రూపొందించే బుటా డిజైన్లు అలరిస్తున్నాయన్నారు. హ్యాండ్‌లూమ్ వస్త్రాలు కేవలం దుస్తులు మా త్రమే కావని, సంస్కృతి, చరిత్ర, మహిళల కళాసక్తికి ప్రతిరూపాలని పేర్కొన్నారు. స్థానిక కార్మికుల కృషిని గుర్తించి, ఇలాంటి వస్త్రాలను కొనుగోలు చేయడం మనందరి బాధ్యత అన్నారు. ఎక్స్‌పో ప్రతినిధి శ్రీనివాసరావు మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం ద్వారా గుర్తించిన సిల్క్ ఉత్పత్తులను మాత్రమే ఇక్కడ విక్రయిస్తున్నామన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాలను సందర్శించి వస్త్రాలు కొనుగోలు చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ ఈ ప్రదర్శన దోహదపడుతుందన్నారు.

## వైవిద్యంగా తీర్చిదిద్దాం..

**● 'ఆంధ్రజ్యోతి'తో షైనింగ్ టీచర్ యలమంచిలి దుర్గాభవానీ**



పెనమలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా ఉన్నత స్థానాలకు చేరాలని, వారి ఉన్నతికి చేతనైనంత సాయం అందించి, మట్టిలోని మాణిక్యాలను ప్రపంచానికి పరిచయం చేయాలనే తపనే తనను షైనింగ్ టీచర్‌అవార్డు పొందేలా చేసిందని పెనమలూరు పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు, షైనీ టీచర్ అవార్డు గ్రహీత దుర్గాభవానీ తెలిపారు. మంత్రి నారా లోకేశ్ సన్మానం అందుకొన్న అనంతరం ఆమె ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు.

**? షైనింగ్ టీచర్ అవార్డు పొందారు... స్ఫూర్తినిచ్చిన అంశం?**

**దుర్గాభవానీ :** మట్టిలోని మాణిక్యాలను వెలుగులోకి తీసుతీసుకు రావాలన్న సంకల్పంతో కార్పొరేట్ విద్యార్థుల విజయాలను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వరకు చేర్చడమే ధ్యేయంగా ఐదేళ్లు శ్రమించాను.

**? గ్రామీణ ప్రాంత విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకాన్ని ఏ విధంగా కలిగించగలిగారు**

**దుర్గాభవానీ :** తల్లిదండ్రులకు, విద్యార్థుకు నిరంతరం కౌన్సెలింగ్ ఇవ్వడం, ప్రపంచ పోకడలను తెలియజెప్పడం ద్వారా మోటి చేసేవాళ్లం.

**? విద్యార్థులను ఏవిధంగా తీర్చిదిద్దగలిగారు**

**దుర్గాభవానీ :** సృజనాత్మకతను ఎప్పటికప్పుడు గుర్తించి ఆయా రంగాల్లో రాణించేలా ప్రోత్సహించే వాళ్లం. ఆటపాటలతో పాటు చదువులోనూ రాణించిన విద్యార్థులు 54 మందికి పైగా 500పైగా మార్కులు సాధించారు. పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు బయట కళాశాలలకు వెళ్లకుండా తిరిగి పాఠశాలలోనే ఇంటర్‌లో 96 మంది ప్రవేశం పొందడం విశేషం.

**? గ్రాడ్యుయేషన్ డే జరపాలన్న ఆలోచన ఎలా వచ్చింది.**

**దుర్గాభవానీ :** కార్పొరేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీలోనే జరుపుతున్న గ్రాడ్యుయేషన్ డే జరపడం స్ఫూర్తినిస్తుందని భావించి తామూ జరపాలని నిర్ణయించాం. అప్పటి నుంచి విద్యార్థుల్లో ఏదో సాధించాలనే తపనను గమనించా.

**? విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏవిధంగా అందిపుచ్చుకున్నారు.**

**దుర్గాభవానీ :** కల్చరల్ యాక్టివిటీస్‌తో పాటు ఇన్నోవేటివ్ యాక్టివిటీస్‌ను నేర్చుకుంటూ కళలతో పాటు కలలను సాకారం చేసుకొనేట్లు ప్రోత్సహించే వాళ్లం. వారితో సొంతంగా ప్రాజెక్టులు తయారు చేయించడం, వాటిని ప్రదర్శించడం, మళ్లీ కొత్త ప్రాజెక్టులు చేపట్టేట్లు ప్రోత్సహించడం చేసేవాళ్లం.

**? విద్యార్థులను ప్రోత్సహించడంలో స్థానికుల నుంచి ఎలాంటి సహకారం లభించేంది.**

**దుర్గాభవానీ :** పేరెంట్, టీచర్, స్టూడెంటు సహకారంతోపాటు ఎస్ఎంసీ కమిటీ పూర్తి సహకారం ఇచ్చేంది. ఎన్నారైల నుంచిపాఠశాలకు లక్షలాది రూపాయలు డొనేషన్ల రూపంలో రావడంతో వాటిని సద్వినియోగం చేయడంలో ఉండుంటే వాళ్లం.

**? విద్యార్థులు తమ కాళ్ల మీద తాము నిలబడేందుకు ఎలాంటి ప్రోత్సాహం అందించారు.**

**దుర్గాభవానీ :** పాఠశాలలో సంగీతం, ఆర్ట్, కుట్టు వంటి ఇతర అంశాలను ప్రోత్సహించేవాళ్లం. దీని వల్ల పిల్లలు తమ యూనిఫాం తామే కుట్టుకొని స్వావలంబన సాధించేట్లు ప్రోత్సహించేవాళ్లం.

**? చదువులో వెనుకబడిన వారికి ఎలాంటి ప్రోత్సాహం ఇచ్చారు.**

**దుర్గాభవానీ :** వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాం. ఏ సబ్జెక్టులలో వెనుకబడ్డారో గుర్తించి ప్రత్యేకంగా చెప్పించే వాళ్లం. దీంతో మిగిలిన విద్యార్థులతో కలిసి పోయేవాళ్లు.

## సురక్షిత తాగునీరు అందించాలి : ఎంపీడీవో

గుడ్లవల్లేరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : వాటర్‌వర్క్ సిబ్బంది క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేస్తూ సురక్షిత తాగునీటిని ప్రజలకు అందించాలని ఎంపీడీవో ఎండి ఇమ్రాన్ సూచించారు. వేమవరంలో శుక్రవారం ఆయన పర్యటించారు. రక్షిత తాగునీటి పథకం ద్వారా సరఫరా చేసే తాగునీటి టాంకులో క్లోరినేష్ పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి డోర్ టూడోర్ చెత్త సేకరిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్‌లో క్లోరినేషన్ ను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఇమ్రాన్

# ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తాం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూలై 18(ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి పేదవాడికీ సంక్షేమ ఫలాలను అందిస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక 16,17 వార్డుల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ రానున్న నాలుగేళ్లలో గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించామన్నారు. పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గుడివాడ పురపాలక సంఘ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.10కోట్లు నిధులను కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, నాయకులు రాంబాబు, లింగం ప్రసాద్, సాంబశివరావు, సత్యనారాయణ, జగన్మోహనరావు, రమేష్ చౌదరి, ఇమ్మానియులు, కడియాల గణేష్, నెరుసు కాశీ, దేవరపల్లి కోటి, మరీదు రోహిణ్‌కుమార్, యార్లగడ్డ సుధారాణి, తెలుగు యువత, తెలుగు మహిళ, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

నందివాడ : ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని, గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని వెన్ననపూడిలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి అందరిని ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. గుడివాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు అడుగులు వేయించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల సమయంలో నందివాడలోని ప్రతి గ్రామాన్ని సందర్శించానని, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి నిత్యం కృషి చేస్తున్నానని, ప్రజల భాగస్వామ్యంతోనే అన్ని పనులు చేయగలనని వివరించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే వారందరి తల్లి ఖాతాలో నగదు జమ చేశామన్నారు. దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలెండర్లు అందించామని, ఇచ్చిన హామీ మేరకు పెంచిన రూ.4 వేల పింఛన్‌ను ప్రతీ నెల 1వ తేదీనే ఇంటికి వెళ్లి అందిస్తున్న ఘనత చంద్రబాబు నాయుడికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి, టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, టీడీపీ నాయకులు సురేష్, వెంకన్న, ప్రవీణ్, దాసు, పండు, గంగాధర్‌రావు, మండల టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావిలు



జన్ను శోభన్‌బాబును దుశ్శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

## బీసీల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం

పామర్రు, జూలై 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నుముకగా ఉన్న బీసీ సామాజిక వర్గాల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పామర్రు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన జుజ్జవరం మాజీ సర్పంచ్ జన్ను శోభన్‌బాబును స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కుమార్‌రాజా దుశ్శాలువా, పూలమాలలేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శోభన్‌బాబు లాంటి వ్యక్తి తనకు ఉన్న అనుభవంతో ఆపదవికి వన్నెతీసుకురావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేతోపాటుగా టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, టీడీపీ పట్టణ నేతలు పరిస సుబ్రమణ్యం, వీరంకి వేంకటేశ్వరరావు, మోహనరావు, చాట్ల రమేష్, సందీప్‌లు శోభన్‌బాబును అభినందించారు.

## అమ్మవార్లకు ఆషాఢ సారె

కూచిపూడి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పెదపూడికి చెందిన సీతారామచంద్రస్వామి భక్తబృందం గ్రామంలోని పలు ఆలయాల్లో ఆషాఢ సారె సమర్పించారు. రామాలయం, సాయిబాబా మందిరం, పోతురాజు గుడి, శివాలయం, గంగానమ్మ తల్లి, చంద్రమ్మ తల్లి ఆలయాల్లో పూలు, గాజులు, పసుపు, కుంకుమ, స్వీట్లు, పూజా సామాగ్రి తదితరాలు అందజేశారు.

గుడ్లవల్లేరు : ఆషాఢ మాస వేడుకల నేపథ్యంలో శుక్రవారం వేమవరం కొండాలమ్మ అమ్మవారికి మచిలీపట్నం మూడుస్తంభాల సెంటర్ ప్రాంత మహిళలు ఆషాఢ సారెను సమర్పించారు. ఆషాఢ మూడవ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి సహస్ర కుంకమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు పాల్గొన్నారు.



# వ్యర్థాల రీసైక్లింగ్‌తో పర్యావరణానికి మేలు

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూలై 18(ఆంధ్రజ్యోతి) : లేగసీ వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్‌ల వల్ల పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతుందని, ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు కలుగుతాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక డంపింగ్ యార్డులో స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో రూ.3.09కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ గుడివాడ రూపకల్పనకు అనేక విధాలుగా కృషి చేస్తున్నామన్నారు. లెగసీ వ్యర్థాల ప్రాసెసింగ్ ద్వారా రీసైక్లింగ్ చేయదగిన పదార్థాలను వేరు చేసి, తిరిగి ఉపయోగించవచ్చునన్నారు. మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, జనసేన ఇన్‌చార్జ్ శ్రీకాంత్, టీడీపీ నేతలు రాంబాబు,జగన్మోహనరావు, సత్యనారాయణ, శివాజీ, పాల్గొన్నారు.

గుడివాడ : గుడివాడ పురపాలక సంఘపరిధిలో చేపట్టే నైట్ శానిటేషన్ డ్రైవ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ గుడివాడలో భాగంగా నైట్ శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించామన్నారు. రాత్రి వేళల్లో రహదారులపై ఉంటున్న పశువుల వలన వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, లింగం ప్రసాద్, పాల్గొన్నారు.

గుడివాడ : అమరావతిలో 6.8ఎకరాల స్థలాన్ని కేటాయించి, 58అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీసుకున్న హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక వాసవిచౌక్‌లో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే వెనిగండ్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య ప్రముఖులు గంగరాజు, మోహనరావు, సుబ్బారావు, మురళీకృష్ణ, తిరుపతయ్య పాల్గొన్నారు.



ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

# శివారు భూములకు సాగునీరేది..!

గుడ్లవల్లేరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు శివారు భూములకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పుల్లేరు నుంచి దిగువకు నీరు ఇస్తున్నప్పటికీ శివారు ప్రాంతాలకు వెళ్లేటప్పటికి నీరు అడుగంటిపోతుండటమే కారణం. ఎండలు మండుతున్న నేపథ్యంలో వర్షాలు సరిగా పడక రైతులు సాగునీటికోసం, వర్షాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఎదురైయింది. కాలవల ఎగువ ప్రాంతాల్లో రైతులు ఇంజన్లతో నీరు తోడేస్తుండగా సివారు ప్రాంతాలకు జాలు మాత్రమే వెళతుంది అది సివారు ప్రాంతాల్లో ఇంజన్లు పెట్టి నీరు తోడేందుకు కూడా సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు నీటిని చివరి భూములవరకూ సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని. మోగలో ఇంజన్లను అదుపు చేయాలని రైతులు కోరుతున్నారు. సీతాదేవి కెనాల్ నుండి, క్యాంబెల్ కెనాల్ నుండి తాడిచర్ల వద్ద తూముద్వారా పంటబోదికి, పోలరాజ్ కెనాల్ నుండి విన్నకోట సుబ్బిచెరువు మీదుగా ఒక పంటబోది ద్వారా ఇలా మూడు పంట కాల్వల ద్వారా సాగునీరు వస్తున్నప్పటికీ పురిటిపాడు, తాడిచర్ల,కట్వానిచెరువు, విన్నకోటలో కొంత ప్రాంతాల్లో దాదాపు 500 ఎకరాలకు నీటి ఎద్దడి ఉందని రైతులు చెబుతున్నారు. మండలంలో మరో ప్రాంతం సమ్మాలకోడు, కొంకేపూడి చానల్ పరిధిలో గాదేపూడి, ఉలవలపూడి గ్రామాల్లో దాదాపు యాభై నుండి అరవై ఎకరాలకు వరకూ నీరందక చేలు ఎండుతున్న సమస్య ఉందని రైతాంగం చెబుతున్నారు.



పురిటిపాడులో వరిచేలకు నీరందక నెర్రెలిచ్చిన భూమి



ఇంజన్లతో నీరు పెడదామన్నా అందేస్థాయిలో లేని సాగునీరు

# వాహనాల బ్రేక్ సెంటర్‌ను గుడివాడలోనే కొనసాగించాలి

● సీఐటీయూ నేత ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ, జూలై 18(ఆంధ్రజ్యోతి) :ప్రధాని మోడీ ట్రాన్స్‌పోర్టు రంగాన్ని కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టి దేశంలో ఏటీఎస్ అనే కొత్త పద్ధతిని తీసుకువచ్చారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక స్టేడియం వద్ద గల మినీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వద్ద ఏటీఎస్‌పై వాహన యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు ఒకటే ఏటీస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం దారుణమన్నారు. గుడివాడలోనే బ్రేక్ సెంటర్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. గుడివాడలో 6900 వాహనాలున్నాయని, గుడివాడ నుంచి మచిలీపట్నం వెళ్లి బ్రేక్ చేయించుకోవాలంటే ఆర్థిక భారం పడుతుందన్నారు. పాత పద్ధతిలోనే గుడివాడలోనే బ్రేక్ చేయించుకునే వెసలుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ది గుడివాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అడుసుమిల్లి శ్రీనివాసరావు, మినీ ట్రాన్స్‌పోర్టు యూనియన్ నాయకులు గోపాలరావు, శివయ్య, లారీ అసోసియేషన్ నాయకులు రామకృష్ణ, వై.భానుమూర్తి, వెంకటేశ్వరరావు, నరేంద్ర ప్రసాద్,ఎం.శ్రీరామమూర్తి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ నేతలతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

# ప్రత్యేక పాస్‌పోర్టు శిబిరం 28న

● ఎస్.రాజేష్

కూచిపూడి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నాట్య క్షేత్రమైన కూచిపూడిలో ఈ నెల 28, 29వ తేదీల్లో ప్రత్యేక పాస్ పోర్టు శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు ఉయ్యూరు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి ఎస్.రాజేష్ పేర్కొన్నారు. మొవ్వ ఎంపీడీవో సుహాసినితో కలసి శుక్రవారం కూచిపూడి గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ సిబ్బందితో కలపి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి తగు సూచనలు, సహాలు అందజేశారు. కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠంలో 28న ఈ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా అదే రోజు సాయంత్రం కళాపీఠంలో నాట్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సోమేశ్వరరావు, కళా పీఠం వైస్ ప్రిన్సిపల్ చింతా రవిబాలకృష్ణ, కొండవీటి అమర బాలేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఫణీంద్ర పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న రాజేష్



భీమేశ్వరస్వామి ఆలయంలో..



విజయదుర్గ అమ్మవారి ఆలయంలో..



గౌరీశంకరస్వామి ఆలయంలో..



కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

# ఘనంగా శాకంబరీ ఉత్సవాలు

గుడివాడ, జూలై 18(ఆంధ్రజ్యోతి) : స్థానిక భీమేశ్వరస్వామి , గౌరీశంకరస్వామి, విజయదుర్గ అమ్మవారి దేవాలయాల్లోని అమ్మవారు శాకంబరీదేవి అలంకారంలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మహిళలు అమ్మవారికి ఆషాఢసారెను సమర్పించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో ఆలయాల్లో శాకంబరీ దేవి ఉత్సవాలు జరిగాయని ఆలయాల ఈవో వేణుగోపాలరావు పేర్కొన్నారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో వేంచేసియున్న వాసవీ కన్యకాపరమేశ్వరి క్షేత్రంలోని వాసవీ అమ్మవారు శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. తాజా కూరకాయలు, ఆకు కూరలు, పండ్లతో అమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొన్నారు.

# లింగ వివక్ష రహిత సమాజమే ధ్యేయం

● ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ, జూలై 18(ఆంధ్రజ్యోతి) : పుట్టిన ప్రతి ఆడబిడ్డ భవిష్యత్తుకు బలమైన పునాది అని, లింగ వివక్ష రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో లింగ ఎంపిక నిషేధ చట్టం-1994, గర్భస్రావ నియంత్రణ నిబంధనలు-2003 అమలుపై డివిజన్ స్థాయి మల్టీ మెంబెర్ అప్రోప్రియేట్ అథారిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాల అమలులో అధికారులు, వైద్య నిపుణులు, ఎన్‌జీవోలు కలిసి ముందుకు రావాలన్నారు. కమిటీ సమావేశాన్ని ప్రతి రెండు నెలలకొకసారి నిర్వహిస్తామని, తదుపరి సమావేశం సెప్టెంబర్ 12వ తేదీన ఉంటుందన్నారు. ఈ సమావేశంలో లింగ ఎంపికను నిరోధించేందుకు తీసుకోవలసిన చర్యలు, గర్భస్రావ కేంద్రాల నియంత్రణ, గర్భధారణ పరిశీలన పరికరాలు వినియోగంపై మానిటరింగ్, ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై చర్చ జరిపారు. డీఎస్పీ ధీరజ్ వినీల్, డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రోగ్రాం ఆఫీసర్ అరుణ్‌కుమార్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

## యాదవుల ఉన్నతికి కృషిచేసిన వ్యక్తి కొడాలి

గుడివాడ, జూలై 18(ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రులు కొడాలి నాని, కఠారి ఈశ్వర్‌కు మార్‌లపై కూటమి యాదవ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, యాదవ సామాజికవర్గ ఉన్నతికి కృషి చేసిన వ్యక్తి కొడాలి నాని అని జడ్పీటీసీలు గోళ్ల రామకృష్ణ, కందుల దుర్గాకుమారి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొడాలి నానికి వ్యక్తిగతంగా కఠారి మద్దతు పలికారన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ హారికకు యాదవ సంఘం మద్దతు ఉంటుందని మాత్రమే కఠారి అన్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక యాదవ ఉద్యోగులపై కక్ష సాధింపు, వ్యాపారులపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు జ్యోత్స్న దేవి, మీగడ మురళీధర్, వైసీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా యువత విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, నాయకులు కందుల నాగరాజు, తోట నాగరాజు, లోయ రాజేష్, జోగా కిషోర్, మేకల సత్యనారాయణ, కొల్లిపర చైతన్య, కొలుసు నరేంద్ర, బోయిన చంద్రశేఖర్, ఈశ్వర్, గణేష్‌బాబు, సతీష్, వీర్రాజు, శేషు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీరాం

గుడివాడ, జూలై 18(ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా తాతినేని శ్రీరాంను నియమించినట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నూతన అధ్యక్షుడు తాతినేనిని ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామినేని వెంకటకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు వలపర్ల వెంకటేశ్వరరావు, కోనేటి వెంకటేష్, మాచర్ల రామకృష్ణ, తేజమాణిక్యం, పాల్గొన్నారు.

## సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

కూచిపూడి : సహకార సంఘాలకు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు సకాలంలో నిర్వహించాలని సీపీఎం మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం సైతం గడువు తీరినప్పటికీ సహకార సంఘాలకు ఎన్నికలకు నిర్వహించకుండా తమకు అనుకూలమైన వారిని ఇంచార్జ్‌లుగా కొనసాగిస్తూ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను పాటించటం లేదన్నారు. సహకార సంఘాలకు ప్రజాస్వామ్యబద్దంగా సకాలంలో ఎన్నికల్లో నిర్వహించి సొసైటీల ద్వారా రైతులకు విత్తనాలు, రుణాలు, ఎరువులు రాజకీయాలకతీతంగా అందించాలని తెలిపారు.

## స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

గుడివాడ : వాంబే కాలనీలో ఎట్టి పరిస్థితుల్లో స్మార్ట్‌మీటర్‌లను బిగించనివ్వమని వాంబే కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి సిద్ధినేని రంగమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వాంబే కాలనీలోని మెయిన్ రోడ్డు సెంటర్‌లో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సహాయ కార్యదర్శి నాగేశ్వరమ్మ, ఉపాధ్యక్షురాలు కుమారి, మల్లీశ్వరీ, సభ్యులు విజయ, బషీరా, రమణ, వరలక్ష్మీ, విజయలక్ష్మీ, గంగాభవాని, మణి, లక్ష్మీ, కృష్ణవేణి, గౌరమ్మ, సంతోషి, సామ్రాజ్యం పాల్గొన్నారు.

## వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ

గుడివాడ : పామర్రుకు చెందిన శిల్పా కట్ పీసెస్ అధినేత గుంటక శ్రీకాంత్‌రెడ్డి, కల్యాణి దంపతుల కుమార్తె చిన్నారి కాశ్వి జన్మదినం సందర్భంగా శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మమత వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నాయకులు లింగం ప్రసాద్ మాట్లాడుతూ గుంటక శ్రీకాంత్‌రెడ్డి గత ఏడాది కూడా వృద్ధాశ్రమంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. తన వంతు సహాయ, సహకారాలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.హరి కుమార్, సభ్యులు తిరుపతయ్య, తాతారావు, పుట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం రేపు

గుడ్లవల్లేరు : ప్రముఖ పారిశ్రామిక వేత్త దివంగత బొప్పన శరత్‌గోపాల్ జ్ఞాపకార్థం శరత్‌గోపాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. పెంజంద్రలో ఇందిర మహల్‌లో నిర్వహించనున్న ఈ వైద్య శిబిరంలో చెవి, ముక్కు, గొంతు, గుండె సంబంధిత వ్యాధులకు, నరాలకు, జనరల్ ఫిజీషియన్, ఎముకలు, కీళ్లు, కంటి పరీక్షలు నిర్వహించనున్నామని మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 109, 117, 128 |
| చికెన్ విత్ స్కిన్ | 210 |
| చికెన్ స్కిన్‌లెస్ | 220 |



**నెక్ కోడిగుడ్ల ధర (100)**

విజయవాడ జోన్ రైతు ధర రూ. 520

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మచిలీపట్నం టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మూడు నెలల క్రితం శస్త్రచికిత్స చేయించుకున్న గొడుగుపేటకు చెందిన కొండేటి విజయలక్ష్మికి శుక్రవారం మంత్రి కొల్లు రవీంద్ర రూ.41,112 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కట్టా అంజిబాబు, లోగిశెట్టి వెంకట స్వామి, మోటమర్రి బాబా ప్రసాద్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

## బయోమెట్రిక్ హాజరు నిలుపుదల సంతోషదాయకం

● అర్చక సంఘాల ప్రతినిధులు

అవనిగడ్డ, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో అర్చక స్వాములకు ముఖ ఆధారిత గుర్తింపు హాజరు(బయోమెట్రిక్) తప్పనిసరి అంటూ దేవదాయశాఖ జారీ చేసిన ఉత్తర్వులను నిలిపివేస్తూ కమిషనర్ ఆదేశాలివ్వటంపై అర్చక సంఘాలు శుక్రవారం హర్షం వ్యక్తం చేశాయి. బయోమెట్రిక్ నిలుపుదల చేయాలని దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్‌ను అర్చక సంక్షేమ సంఘం, రాష్ట్ర అర్చక ఐక్యవేదిక ప్రతినిధులు కోరారని, అర్చకులు ఇబ్బందులు తెలుసుకున్న కమిషనర్ బయోమెట్రిక్ నిలుపుదల చేయాలని ఉత్తర్వులు ఇచ్చారని సంఘం ప్రతినిధి మేడూరి శ్రీనివాసమూర్తి తెలిపారు.

# హామీలన్నీ అమలు చేస్తాం

● ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్‌తో కలిసి శుక్రవారం ఆయన పట్టణంలోని 20వ వార్డులో పర్యటించారు. 67 లక్షల మందికి పైగా విద్యార్థులకు తల్లికి వందనం అమలు చేశామని, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. కృష్ణప్రసాద్, వేదవ్యాస్ ఇంటింటికీ వెళ్లి అమలవుతున్న పథకాలను వివరించి కరపత్రాలు అందించారు. కౌన్సిలర్ కొనసం కరుణకుమారి, యక్కల శ్యామలయ్య, కమ్మగంటి బాబు, తమ్మా భీమయ్య, పూలబాబు పాల్గొన్నారు.



పెడనలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, అవనిగడ్డలో టీడీపీ నేతలు

### అధినాయకుడి మెప్పు కోసమే వైసీపీ నేతల రెచ్చగొట్టే వ్యాఖ్యలు: బూరగడ్డ వేదవ్యాస్

తమ అధినాయకుడి మెప్పు కోసమే నరికేయండి, చంపేయండి, చీకట్లో కాదు పగలే నరికేయండి అంటూ వైసీపీ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది దారుణమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాళా తీయించిందని, జగన్ పాలనలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అంచెలంచెలుగా అన్ని పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన స్పష్టంచేశారు.

### పేదరిక నిర్మూలన, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అవనిగడ్డ: రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 8వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నాయకులు కర్రా సుధాకర్, పరుచూరి దుర్గాప్రసాద్, మండలి రామ్మోహనరావు, షేక్ బాజావలి, మేడికొండ విజయ్, బచ్చు హనుమాన్, కమ్మిలి సుబ్రహ్మణ్యం, బట్టు నరసింహారావు, మట్టా బాపూజీ, పైడిపాముల బాబూరావు పాల్గొన్నారు. రెండో వార్డులో టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు నేతృత్వంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి నేతలు పుల్లగోరు రాజేంద్ర, బచ్చు రఘునాథ్, గుడివాక శివరావు, చందన నరసింహారావు, మాదివాడ రాము పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు, ఆర్యవైశ్యులు

## సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

మచిలీపట్నం టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహ ఏర్పాటు, స్మృతివనానికి 6.8 ఎకరాల స్థలాన్ని కేటాయించినందుకు ప్రభుత్వానికి కూటమి నాయకులు, ఆర్యవైశ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రాపటాలకు వారు పాలాభిషేకం చేశారు. విగ్రహ ఏర్పాటుకు విరాళాలు ఇచ్చేందుకు ఆర్యవైశ్యులు ముందుకు రావాలని బాబాప్రసాద్ పిలుపునిచ్చారు. టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, జనసేన నాయకుడు గడ్డం రాజు, టీడీపీ సీనియర్ నాయకులు గోపీచంద్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, కార్పొరేటర్లు కీర్తి, అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్, ఆవోపా సభ్యులు, ఆర్య వైశ్య సంఘం మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎరువుల కృత్రిమ కొరత సృష్టించొద్దు

● దుకాణాల యజమానులతో విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు

చల్లపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని వ్యాపారులను విజిలెన్స్ డీఎస్పీ వి.బంగారాజు, వ్యవసాయశాఖ ఏడీఏ పి.చంద్రశేఖర్ హెచ్చరించారు. మండలంలో విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. చల్లపల్లి, లక్ష్మీపురం, పురిటిగడ్డ గ్రామాల్లోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విక్రయ దుకాణాలను వారు తనిఖీచేశారు. రికార్డులను చూసి స్టాకు పరిశీలించారు. హోల్‌సేల్, రిటైల్ లైసెన్సుదారులు అధీకృత కంపెనీల నుంచి నాణ్యమైన ఉత్పత్తులను కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలని, రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించిన లైసెన్సుదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవో కె.మురళీకృష్ణ, టెక్నికల్ ఏవో ఎల్.శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు

## పట్టాభి భవన నిర్మాణానికి ఎన్వోసీ ఇవ్వాలి

మచిలీపట్నం టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనానికి మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో అనుమతులు ఇస్తూ తీర్మానించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టాభిస్మారక భవనానికి కేటాయించి స్థలం వద్ద శుక్రవారం వారు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్పొరేటర్లు, అధికారులు తీర్మానం చేసేందుకు సహకరించాలని కోరారు. వేము కోటేశ్వరరావు, కొనకళ్ల అరుణ్‌కుమార్, పీవీ ఫణికుమార్, జన్ను వెంకటేశ్వరరావు, ఆళ్ల మాధవ తదితరులు పాల్గొన్నారు.



పట్టాభి స్మారక భవనానికి కేటాయించిన స్థలంలో నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

## పీ-4 లక్ష్య సాధనలో ఉద్యోగులు భాగస్వాములవ్వాలి

అవనిగడ్డ, జూలై 18(ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమ లక్ష్య సాధనలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులకు పీ-4 కార్యక్రమంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వ్యాపారులు, ఎన్ఆర్ఐలు, ఆర్థికంగా స్థిరపడిన వారిని గుర్తించి పేదలను దత్తత తీసుకునేలా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఆరు మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి పి.సాయిబాబు

## కొల్లూరి చిన్నాకు స్టార్ ఎక్సలెన్స్ అవార్డు

పెడన, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తన ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు కొల్లూరి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కొల్లూరి చిన్నాను నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డుకు వైఎంకే అకాడమీ ఎంపిక చేసింది. ఈనెల 20న విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని గుజ్జల సరళాదేవి ఫంక్షన్ హాలులో నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో వైఎంకే అకాడమీ వ్యవస్థాపకుడు గల్లా రూపస్‌పాల్ నుంచి ఆయన అవార్డు అందుకోనున్నారు. చిన్నాకు పలువురు అభినందనలు తెలిపారు.



## శ్మశానవాటికను అభివృద్ధి చేయండి

కోడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ముందడుగు గ్రామ సమీపంలోని శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబుకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పూతబోయిన సీతారత్న సాయిబాబు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పి.సాయిబాబును ఆయన కలిశారు.

## ఆషాఢ సారె సమర్పణ

నాగాయలంక, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భావదేవరపల్లి గ్రామంలోని శ్రీదేవీ భూదేవి సమేత భావన్నారాయణ స్వామి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి భక్తులు ఆషాఢ సారెను సమర్పించారు. ఆలయ అర్చకులు పంచాంగ శాస్త్రి ప్రత్యేక పూజలు చేశారు.

# శాకంబరి అలంకారంలో అమ్మవార్లు

మచిలీపట్నం టౌన్/అవనిగడ్డ/చల్లపల్లి/నాగాయలంక, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా కాళికా పైడమ్మ, లక్ష్మీ నాంచారమ్మ, దుర్గమ్మ, భువనేశ్వరీ దేవి అమ్మవార్లు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మచిలీపట్నం నిజాంపేటలో కాళికా పైడమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. 108 మంది సువాసినులు అమ్మవారికి ప్రత్యేక అర్చనలు జరిపారు. పొన్నూరు వెంకటేశ్వరరావు, కర్నాటపు జగదీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో బాలాత్రిపుర సుందరీ సహిత లక్ష్మీనాంచారమ్మ అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ పెద్దలు దాలిపర్తి నారాయణరావు, సుబ్బారావు, మోదుమూడి కుటుంబరావు, శ్రీనివాసరావు, కనగాల రాధాకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అవనిగడ్డ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో భువనేశ్వరీదేవి అమ్మవారు శుక్రవారం శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణ చేశారు. అర్చక స్వా ములు దీవి రఘునాథాచార్యులు, బాలకృష్ణమాచార్యులు భక్తులకు మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదాలను అందించారు. నాగాయలంక మండలం గణపేశ్వరంలోని గణపేశ్వరస్వామి ఆలయంలో దుర్గమ్మ అమ్మవారు భక్తులకు శాకంబరీ దేవిగా దర్శనమిచ్చింది. అర్చకుడు పోతుకూచి నాగ వెంకటసాయి శర్మ, సత్యనారాయణ శాస్త్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్త మండలి శ్రీరామచంద్రమూర్తి, ఆలయ ఈవో సీహెచ్ సుధాకరరావు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న నిజాంపేట కాళికా పైడమ్మ, లక్ష్మీపురం బాలాత్రిపుర సుందరీ సహిత లక్ష్మీనాంచారమ్మ, అవనిగడ్డ భువనేశ్వరీదేవి, గణపేశ్వరం దుర్గమ్మ



యలమంచిలి జనార్దనరావు, దైతా మధుసూదనశాస్త్రి ఇంజనీరింగ్ కళాశాలలో నూతన పాలిటెక్నిక్ కాలేజీని ప్రారంభించాక మాట్లాడుతున్న విద్యావేత్త పీవీ రావు

## పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం

మచిలీపట్నం టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉద్యోగావకాశాలు సాధించాలని విద్యావేత్త, సుజన అకాడమీ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అధ్యక్షుడు పీవీ రావు సూచించారు. యలమంచిలి జనార్దనరావు, దైతా మధుసూదనశాస్త్రి ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి పీవీ రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రిన్సిపాల్ టి.రవికుమార్, ప్రోగ్రాం ఇన్‌చార్జి పి.నాంచారయ్య, నాగజ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.



రాజాగారి భూములకు వెళ్లే బోదె పూడిక తీయించాలని కోరుతున్న రైతులు

## పంట బోదె పూడిక తీయించండి

మోపిదేవి, జూలై 18(ఆంధ్రజ్యోతి): కె.కొత్తపాలెం, పాగోలు వెళ్లే 8వ నెంబర్ పంట కాలువ సమీపంలో రాజా గారి భూములకు వెళ్లే పంటబోదెను పూడికతీత తీయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ బోదె కింద 200 ఎకరాలు సాగు చేస్తున్నామని, సాగునీరు లేక నారుమడులు ఎండిపోతున్నాయని రైతు బుర్రె వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి, పూడిక తీయించాలని రైతులు చందన అనిల్, దుట్టా శేషుబాబు, మత్తి యానాదిరావు, మత్తి నాగేశ్వరరావు, అరుంబాక సుబ్బారావు, రామిశెట్టి వర్ధమాన్ కోరారు.

## కిక్కిస తొలగింపు పనులు ప్రారంభం

కోడూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కోడూరు శివారు నరసింహాపురం సమీపంలో ఉన్న నాన్ నోటిఫైడ్ డ్రెయిన్‌లో కిక్కిసకాడ తొలిగింపు పనులను పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. రైతులు కిక్కిస తొలగించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన అధికారులతో మాట్లాడారని దేవనబోయిన తెలిపారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారని, మూడు కిలోమీటర్ల మేర పనులు చేపట్టామని పేర్కొన్నారు. ముద్దినేని శ్రీమన్నారాయణ, ఇంకొల్లు రాంబాబు, ఇంకొల్లు సత్యనారాయణ, పెదబాబు, విశాల్ బాబు, సాంబశివరావు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు

ఘంటసాల, జూలై 18(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం గ్రామంలో ఆయన పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.